

ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. బైక్ ర్యాలీ చేస్తూ జూడాల నిరసన





జూడాలకు మద్దతుగా నిలిచిన ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, తిరుపతి మేయర్ శిరీష తదితరులు



# రక్షణకోసం రోడ్డెక్కారు!

**● స్విమ్స్, రుయా జూనియర్ డాక్టర్ల బైక్ ర్యాలీ**

తిరుపతి(వైద్యం), ఆగస్టు 17 : మహిళా రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలని జూనియర్ డాక్టర్లు (జూడాలు) డిమాండ్ చేశారు. కోల్‌కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాలలో జూనియర్ డాక్టరు హత్యాచారం కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని స్విమ్స్, రుయాస్పత్రిలోని జూడాలు రుయాస్పత్రి ఆవరణలో శనివారం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలను చేపట్టారు. విధుల్లో ఉన్న జూనియర్ డాక్టరుపై ఇంతటి అఘాయిత్యం జరిగినా ప్రభుత్వాలు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం అమానుషమన్నారు. ఇలాంటి దారుణానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా డాక్టర్లకు కొత్త రక్షణ చట్టాలను వెంటనే అమలు చేయాలన్నారు. అనంతరం ప్లకార్డులు చేత బట్టి నినాదాలు చేస్తూ ఆస్పత్రి ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. అలాగే స్విమ్స్‌లోని జూనియర్ డాక్టర్లు స్విమ్స్ అత్యవసర విభాగం ముందు నిరసన కార్యక్రమాలను నిర్వహించి.. అక్కడినుంచి ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా రుయాస్పత్రికి చేరుకున్నారు. అక్కడ రుయాస్పత్రిలో నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లతో కలిసి ద్విచక్ర వాహనాలపై నినాదాలు చేస్తూ టౌన్ క్లబ్ వరకు ర్యాలీ నిర్వహించారు.

**మేయర్, ఎమ్మెల్సీ, పలు యూనియన్ల మద్దతు**

రుయాస్పత్రిలో జూడాలు నిర్వహిస్తున్న నిరసనకు మేయర్ డాక్టర్ శిరీష, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం మద్దతుగా నిలిచారు. వారు మాట్లాడుతూ.. విధుల్లోని వైద్యులపై ఇటీవల దాడులు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వాలు కఠిన చట్టాలను అమలు చేయకపోవడం వల్లే కోల్‌కతాలో ఇలాంటి అమానుష ఘటన జరిగిందన్నారు. అలాగే ఏపీఎన్జీవోస్, ఏపీ హంస, ఏపీ నర్సింగ్ అసోసియేషన్, తిరుపతి ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్, ఏఐటీయూసీ సంఘాల నేతలు కూడా మద్దతు తెలిపారు. ఏపీఎన్జీవోస్, ఏపీ హంస నేతలు నైనారు వరప్రసాద్, రాజా మాట్లాడుతూ. మహిళా డాక్టరుపై ఇంతటి అమానుష ఘటన జరగడం బాధాకరమన్నారు. ఆమె కుటుంబీకులకు సమాజం తరపున క్షమాపణలు తెలిపారు.

**ప్రైవేటు ఆస్పత్రుల్లో నిలిచిన ఓపీడీ సేవలు**

జూడా హత్యను వ్యతిరేకిస్తూ ఐఎంఏ పిలుపుతో జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో శనివారం ఓపీడీ సేవలను నిలిపేశారు. కేవలం అత్యవసర సేవలు మినహా ఓపీడీ, సాధారణ శస్త్ర చికిత్సలను పూర్తి స్థాయిలో నిలిపేసి ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యం సంఘీభావాన్ని వ్యక్తం చేసింది. జూనియర్ డాక్టరు హత్యపై న్యాయం జరిగే వరకు పోరాటం తీవ్రతరం చేస్తామని ఐఎంఏ తిరుపతి శాఖ అధ్యక్షుడు డాక్టర్ జనార్దన్ ఒక ప్రకటనలో తెలిపారు.

**స్విమ్స్‌లో ఎపిలెప్సీ క్యాంపు వాయిదా**

స్విమ్స్‌లోని న్యూరాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రతి మూడో ఆదివారం నిర్వహించే ఎపిలెప్సీ క్యాంపు (మూర్ఛ వ్యాధిగ్రస్తులకు ఉచిత మందుల పంపిణీ)ను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోల్‌కతాలో జరిగిన జూనియర్ డాక్టరు హత్యాచారానికి నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపుతో రెండ్రోజులుగా కొనసాగుతున్న జూనియర్ డాక్టర్ల నిరసన వల్ల ఈ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు.



నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు

**ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో..**

తిరుపతి(విద్య): జూనియర్ డాక్టర్‌పై హత్యాచారంపై ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలోనూ విద్యార్థులు తిరుపతిలో శనివారం ర్యాలీ, నిరసన ప్రదర్శన చేశారు. ముందుగా ఎంఆర్‌పల్లె కూడలిలోని దండు మార్చ్ విగ్రహం వద్ద నిరసన తెలిపి, అక్కడినుంచి అన్నమయ్య సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. నాయకులు అక్బర్, నవీన్ మాట్లాడుతూ.. ఘటన జరిగి ఎనిమిది రోజులు గడుస్తున్నా కేసులో ఏమాత్రం పురోగతి లేదన్నారు. దీనికంతటికీ బాధ్యత వహిస్తూ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వినోద్, నరేంద్ర, బాల, వీరేష్, వినయ్, ఓంరాజు, శ్రీహరి, మోహన్, చంద్రనాయక్, బాషా, మహిళా సమాఖ్య జిల్లా నాయకులు మంజుల తదితరులు పాల్గొన్నారు.

## గాదంకి టోల్‌ప్లాజా వద్ద
# గంజాయి కలకలం

**కారు డిక్కీ నుంచి రోడ్డుపైపడ్డ రెండు ప్యాకెట్లు**



పాకాల/చంద్రగిరి, ఆగస్టు 17: రెండు గంజాయి ప్యాకెట్లు కారు డిక్కీ నుంచి రోడ్డుపైపడిన ఘటన గాదంకి టోల్ ప్లాజా వద్ద శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు, టోల్ ప్లాజా అధికారుల సమాచారం మేరకు.. శనివారం రాత్రి పాకాల మండలం గాదంకి సమీపంలోని టోల్‌ప్లాజా స్పీడ్ బ్రేకర్ వద్ద తిరుపతి నుంచి చిత్తూరు వైపు వెళుతున్న ముదురు నీలి రంగు కారు డిక్కీ నుంచి రెండు ప్యాకెట్లు ఎగిరి రోడ్డుపై పడ్డాయి. ఆ తర్వాత కారు అతివేగంగా వెళ్లిపోయింది. దీన్ని టోల్ సిబ్బంది గమనించి.. ప్యాకెట్లను పరిశీలించగా, అందులో గంజాయి కనిపించింది. వెంటనే ఐడీ పార్టీ పోలీసులకు సమాచారం అందించారు. కారు వేగంగా వెళ్లడం, డిక్కీలో నుంచి ప్యాకెట్లు ఎగిరిపడటం టోల్‌గేట్ సీసీ కెమెరాలో రికార్డు అయింది. కారు డిక్కీ నిండా ప్యాకెట్లు ఉండటం వల్లే డోర్ పూర్తిగా లాక్ పడలేదని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈసంఘటనపై పోలీసులు విచారణ ప్రారంభించారు.

## యంత్రభూతానికి బలైన చిన్నారి



నవ్యశ్రీ

వాకాడు, ఆగస్టు 17 : కోలాటమాడడానికి వెళ్లిన ఓ చిన్నారి యంత్ర భూతానికి బలైపోయింది.వాకాడులో ఏఎస్ఐ శ్రీనివాసులురెడ్డి కథనం మేరకు... చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం మర్రిమాకుల కండ్రిగకు చెందిన బండి నవ్యశ్రీ (11) మరో 20మందితో కలసి తిరుపతి జిల్లా వాకాడులోని మహాలక్ష్మి ఆలయంలో తిరునాళ్లకు కోలాటం వేయడానికి శుక్రవారం వచ్చింది. కోలాటమాడి అలసిపోయిన ఆమె తెల్లవారుజామున జనరేటర్ పక్కనే పడుకుంది. అది ఓపెన్‌టైపు జనరేటర్ కావడంతో ఫ్యాన్‌లో పక్కనే పడుకొని ఉన్న నవ్యశ్రీ జడ చిక్కుకుంది. ఒక్కసారిగా తల మొత్తం జనరేటర్‌లోకి వెళ్లడంతో అక్కడిక్కడే మృతి చెందింది.విగతజీవిగా పడి ఉన్న నవ్యశ్రీని చూసి ఆమెతో వచ్చినవారు కన్నీరుమున్నీరయ్యారు.

# దోషం దందా

## ముక్కంటి ఆలయంలో ఆగని వసూళ్లపర్వం



రూ.500 రాహుకేతు మండపం వద్ద బారులు తీరిన భక్తులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 17 : శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తులను దోపిడీ చేయడం ఆగడమేలేదు. ప్రత్యేకించి రాహుకేతు పూజల్లో భక్తుల నుంచి బలవంతపు వసూళ్లు విచ్చలవిడిగా సాగిస్తూనే ఉన్నారు. గత వైసీపీ పాలనలో ఒక దోషపూజల విభాగంలోనే రూ.50కోట్లకు పైగా అక్రమ సొమ్మును పోగేసి అప్పటి పాలకులు, అధికారులు పంచుకున్నారన్నది బహిరంగ రహస్యం.కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆలయంలో అధికారులు కొద్దిరోజుల పాటు ఈ దందాలను పక్కన పెట్టారు. అక్రమ సంపాదనకు అలవాటుపడిన సిబ్బంది మళ్లీ బహిరంగ వసూళ్లకు తెరతీశారు. అయితే ఈసారి దోష పూజల్లో దక్షిణకు పక్కాగా అధిక ధరలు కేటాయించి మరీ ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.గ్రహణకాల అభిషేకాలను దర్శించుకోవడానికి,రాహుకేతు సర్పదోష పూజలు జరిపించుకునేందుకు విదేశాల నుంచి సైతం పెద్దసంఖ్యలో ఇక్కడికి భక్తులు వస్తుంటారు.రాహుకేతు పూజలను ఐదు రకాల ధరలతో విక్రయిస్తారు.రూ.500,రూ.750, రూ.1,500, రూ.2,500, రూ.5వేలు టిక్కెట్లుగా విభజించి ఆయా మండపాల్లో బ్యాచ్‌ల వారీగా పూజలు చేస్తుంటారు. ఉదయం 6నుంచి సాయంత్రం 6 వరకు రోజూ ఈ పూజలు జరుగుతూనే ఉంటాయి. మండపాల్లో ఆశీనులైన భక్తులకు సామూహికంగా సంకల్పాన్ని మైక్‌లో అనౌన్స్ చేస్తూ రాహుకేతు పూజలు జరిపిస్తారు.ఇదే మైక్ నుంచి అక్కడ పనిచేసే సిబ్బంది బహిరంగంగా దక్షిణ సమర్పించాలంటూ భక్తులను డిమాండు చేస్తున్నారు. దక్షిణ సమర్పిస్తేనే మీ దోషం పోతుందంటూ మానసికంగా భయపెడుతున్నారు.రూ.101 చెల్లించాలంటూ పీడించి మరీ వసూలు చేస్తున్నారు. నెల రోజుల నుంచి రూ.2,500 పూజల్లో అయితే రూ.201, రూ.5వేల పూజల్లో అయితే తప్పనిసరిగా రూ.501 దక్షిణ పెట్టాలంటూ భక్తులను బలవంతపెడుతున్నారు. ఆలయంలో నెలకు రాహుకేతు పూజలు సుమారు లక్ష వరకు జరుగుతాయని అంచనా. ప్రభుత్వం మారినా రాహుకేతు పూజామండపాల్లో వసూళ్లు ఆగలేదు. పైగా దక్షిణ ధరను ఖచ్చితంగా నిర్ణయించి మరీ వసూలు చేస్తున్నారు. ఇటీవల రూ.2,500 పూజల్లో రూ.201 దక్షిణ పెట్టాలంటూ అక్కడ సిబ్బంది మైక్‌లో ఆదేశించారు. అయితే రూపాయి నాణెం లేని కొందరు భక్తులు ఏంచేయాలో అర్థం కాక చుట్టుపక్కల వారిని యాచించాల్సిన దుస్థితి ఎదురైంది. మొత్తంగా ఆలయంలో రాహుకేతు పూజల ద్వారా లక్షలాది రూపాయల సొమ్మును పోగేసి కింది నుంచి పైస్థాయి అధికారి వరకు పంచుకుంటున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**రాహువుకు, కేతువుకు వేర్వేరుగా సమర్పించండి**

గతంలో పూజ చేసుకున్న తరువాత రూ.500 రాహుకేతు పూజల్లో రూ.101 సమర్పించాలని మైకులో భక్తులను ఆదేశించేవారు. అయితే ఇప్పుడు రద్దీ తక్కువుండే రోజుల్లో రాహువుకు రూ.151, కేతువుకు రూ.151 చొప్పున వేర్వేరుగా సమర్పిస్తేనే దోషం పోతుందంటూ వసూలు చేస్తున్నారు. పెరిగిన ఆదాయాన్ని వాటాలు వేసుకునే విషయంలో విభేదాలు తలెత్తాయి. దాంతో రూ.500 మండపంలో పని చేసే ఓ అర్చకుడిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు తెలిసింది.



రాహుకేతు పూజల్లో భక్తులు

**యధేచ్ఛగా హారతిపళ్లేలతో వసూళ్లు**

ఇటీవల ఆలయంలో హారతి పళ్లేల దందా బాగా పెరిగింది.హారతి పళ్లేల ద్వారా భక్తుల నుంచి దక్షిణ వసూలు చేయడాన్ని దేవదాయశాఖ నిషేధించింది.కానీ ముక్కంటి ఆలయంలో మాత్రం వైసీపీ పాలనలో హారతిపళ్లేల ద్వారా అధిక ఆదాయాలు లభించే స్థానాల కోసం పలువురు అర్చకులు పోటీపడ్డారు. ముడుపులు సమర్పించి మరీ ఆదాయ స్థావరాలను చేజిక్కించుకున్నారు.మూడేళ్ల క్రితం ఉన్నతస్థాయిలో ఉండే ఇద్దరు అర్చకులు భక్తుల ఎదుటే దక్షిణ విషయమై హారతి పళ్లేలను ఒకరిపై ఒకరు విసురుకునే స్థాయికి వివాదం రేగింది.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కొద్దిరోజుల పాటు ఈ వసూళ్లను పక్కన పెట్టారు. కొద్దిరోజుల వ్యవధిలోనే ప్రధాన ఆలయంతో పాటు చిన్నచిన్న పరివార దేవతల వద్ద కూడా దాదాపు 20చోట్ల హారతి పళ్లేలు వెలిశాయి. బాహాటంగా దక్షిణ సమర్పిస్తేనే హారతి అనే విధంగా వసూళ్లకు పాల్పడుతున్నారు.

# జూపార్కులో త్వరలో తెల్లపులుల సఫారీ

మంగళం, ఆగస్టు 17: ఎస్వీ జూపార్కులో త్వరలో వైట్ టైగర్ సఫారీని తిరిగి ప్రారంభిస్తున్నట్లు జూపార్కు క్యూరేటర్ సెల్వం తెలిపారు. శనివారం జూపార్కులో మీడియాతో మాట్లాడుతూ.. 2018లో వైట్ టైగర్ సఫారీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కరోనా సమయంలో మూసి వేశామన్నారు. ఇపుడు సఫారీలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి, ప్రారంభిస్తామన్నారు. ఇందుకోసం రూ.85లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. అలాగే నాక్‌టర్నల్(రాత్రి పూట తిరిగే జంతువులు, పక్షులు) ఎన్‌క్లోజర్ పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. వీటిలో పునుగు పిల్లులు, దేవాంగ పిల్లి, గుడ్లగూబ, తుమ్మల పందులు వంటి జంతువులను ఉంచుతామన్నారు. రూ.6కోట్ల బడ్జెట్‌తో ఏర్పాటు చేస్తున్న ఈ ప్రాజెక్టుకు టీటీడీ రూ.2కోట్లు మంజూరు చేయగా.. ఇపుడు రూ.4కోట్లు మంజూరు చేసిందన్నారు. ఏడు, ఎనిమిది నెలల్లో ఇది అందుబాటులో వస్తుందన్నారు. జిరాఫీలను తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నామని.. ఒక జత తెప్పించాలంటే రూ.3కోట్లు ఖర్చవుతుందని వివరించారు. మన జూపార్కులో రెండు జతల జిరాఫీల అవసరం ఉందన్నారు. జూపార్కుకు సందర్శకుల సంఖ్య కూడా పెరిగిందని తెలిపారు. వార్షిక ఆదాయం రూ.8.5కోట్లకు చేరుకుందని, ఈ సంవత్సరం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

జూపార్కులో ఏర్పాటు చేస్తున్న నాక్ టర్నల్ ఎన్‌క్లోజర్





# స్టార్ ఎయిర్‌లైన్స్‌పై ప్రయాణికుల ఆగ్రహం



రేణిగుంట, ఆగస్టు 17: స్టార్ ఎయిర్‌లైన్స్ విమానం రద్దు కావడంతో తిరుపతి విమానాశ్రయంలో ప్రయాణికులు నిరసన తెలిపిన ఘటన శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ప్రయాణికులు తెలిపిన వివరాల మేరకు... శనివారం ఉదయం బెల్గాం నుంచి 10.45 గంటలకు తిరుపతికి వచ్చి 11.45 గంటలకు తిరిగి స్టార్ ఎయిర్‌లైన్స్ విమానం బెల్గాం పోవాల్సివుంది. విమానం రద్దయిన విషయాన్ని ఉదయం ప్రయాణికులకు చెప్పకుండా మధ్యాహ్నం 1.30 గంటలకు చెప్పడంతో అప్పటి వరకు వేచివున్న ప్రయాణికుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. సుమారు 45 నిమిషాల పాటు స్టార్ ఎయిర్‌లైన్స్ బుకింగ్ కౌంటర్ వద్ద సంస్థ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.తరచూ ఇలా జరగడం వల్ల ప్రయాణికులు సంస్థ పట్ల నమ్మకం కోల్పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

→ స్టార్ ఎయిర్‌లైన్స్ బుకింగ్ కౌంటర్ వద్ద ప్రయాణికుల నిరసన

# బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

**● జిల్లాలో ఆరువేలమందికి అవకాశం**

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 17: సాధారణ బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం ఉద్యోగుల్లో ఆనందాన్ని నింపింది. ప్రజలతో నేరుగా సంబంధం ఉన్న శాఖల్లో మొదట ఈ ప్రక్రియ చేపడతారు.జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు మినహా సుమారు ఆరువేలమంది బదిలీ కానున్నారు.రెవెన్యూ, పంచాయతీరాజ్, పురపాలక, గ్రామ వార్డు సచివాలయాలు, గనులు, పౌర సరఫరాలు, అన్ని ప్రభుత్వశాఖల్లోని ఇంజనీరింగ్ ఉద్యోగులు, దేవాదాయ, అటవీ, రవాణా, పరిశ్రమలు, విద్యుత్, వాణిజ్య పన్నులు, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖల్లోని ఉద్యోగుల బదిలీలను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.రెవెన్యూశాఖ పరిధిలో సుమారు 1,800మంది,గ్రామపంచాయతీల్లో 700 మందితో కలుపుకుని మొత్తం 6వేలమంది దాకా బదిలీల జాబితాలో ఉన్నారు. సచివాలయాల్లో పని చేస్తున్న ఐదు వేలమంది కూడా బదిలీల జాబితాలో ఉన్నారు. నాలుగైదు రోజుల్లో బదిలీల ప్రక్రియ పూర్తి చేస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.ఇప్పటికే ఎమ్మెల్యేలనుంచి సిఫార్సు లేఖలను తీసుకుని చాలామంది ఉద్యోగులు అధికారుల చుట్టూ తిరుగుతున్న విషయం తెలిసిందే.

## రేపటినుంచి ఈఏపీ సెట్ చివరి విడత కౌన్సెలింగ్

తిరుపతి(విద్య), ఆగస్టు 17: ఈఏపీ సెట్- 2024 చివరి విడత కౌన్సెలింగ్ సోమవారం నుంచి ఈనెల 21వ తేదీ వరకు తిరుపతి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరగనుంది. ఈ మేరకు పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, కౌన్సెలింగ్ కోఆర్డినేటర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. మొదటి, రెండో విడత కౌన్సెలింగ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోని అభ్యర్థులు చివరి విడతకు సోమవారం నుంచి ఈనెల 21వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు ఆప్షన్స్ నమోదు ఉంటుందన్నారు. 26వ తేదీన సీట్ అలాట్‌మెంట్ ఉంటుందని, 26 నుంచి 30వ తేదీలోపు కళాశాలల్లో రిపోర్ట్ చేసుకోవాలని వివరించారు.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.63 కోట్లు

తిరుమల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.63 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి, శనివారం ఉదయం ప్రకటించింది. శుక్రవారం 62,625 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 34,462 మంది తలనీలాలు సమర్పించారు.

## వెంకన్న సేవలో ప్రముఖులు




జాతోతు హుస్సేన్ - కృష్ణన్‌పాల్ గుర్జార్ - వాసంశెట్టి సుభాష్

తిరుమల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వేకువజామున జరిగిన సుప్రభాతసేవలో జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ జాతోతు హుస్సేన్ దర్శించుకోగా, ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కేంద్రమంత్రి కృష్ణన్‌పాల్ గుర్జార్, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, తెలంగాణ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, ప్రభుత్వ మాజీ విప్ శ్రీకాంత్‌రెడ్డి, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.



డోలా బాలవీరాంజనేయస్వామి

**ప్రజలకు మేలు జరగాలని ప్రార్థించా**

ఎన్డీయే ప్రభుత్వంలో ప్రజలకు మేలు జరగాలని శ్రీవారిని ప్రార్థించినట్టు మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. శ్రీవారిని ఆయన శనివారం ఉదయం దర్శించుకున్నారు.

## తిరుమల ఘాట్‌లో అదుపుతప్పిన కారు



తిరుమల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో శనివారం ఓ కారు అదుపుతప్పింది. అదృష్టవశాత్తు కారులోని భక్తులు సురక్షితంగా బయటపడ్డారు. తిరుపతికి చెందిన హరీంద్ర, లక్ష్మణ్ మరో ఇద్దరు మహిళలు శనివారం శ్రీవారిని దర్శించుకుని తమ ఏపీ 39 ఎంఎక్స్ 3484 నెంబరు గల కారులో తిరుమల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గంలోని 18వ మలుపు వద్ద కారు ఒక్కసారిగా అదుపుతప్పి ఎడమవైపునున్న క్రాష్ బ్యారియర్‌ను ఢీకొంది. వేగం అదుపుకాకపోవడంతో కుడివైపునున్న చిన్నపాటి గట్టు మీదుగా దూసుకుపోయి ముందున్న కొండను ఢీకొని ఆగిపోయింది. అదృష్టవశాత్తు కారులోని నలుగురు భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న టీటీడీ ఆటోక్లినిక్ సిబ్బంది ప్రమాదానికి గురైన కారును పక్కకు తొలగించారు.

## వైభవంగా ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఊరేగింపు



రామచంద్రాపురం, ఆగస్టు 17: ఎస్‌ఆర్‌కమ్మపల్లి మహాభారత ఉత్సవాల్లో భాగంగా చిట్టత్తూరు గ్రామంలో ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఊరేగింపు శనివారం వైభవంగా జరిగింది. ఈసందర్భంగా ఆలయంలో మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భాగవతారిణి సీతాలక్ష్మి రాజసూయ యాగం హరికథను వినిపించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. సాయంత్రం ఉత్సవమూర్తులను ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రమేష్‌బాబు, ప్రధానార్చకుడు హరి ఆచారి పాల్గొన్నారు.

## శనీశ్వరుడికి తైలాభిషేకం



రామచంద్రాపురం, ఆగస్టు 17: రాయలచెరువుకట్ట భవాని జలకంఠేశ్వర ఉపాలయంలోని శనీశ్వరస్వామికి, రాయలచెరువుపేట చాయాపురంలోని శనీశ్వరుడికి శని త్రయోదశి సందర్భంగా నిరంతర తైలాభిషేకాలు జరిగాయి. చండీ హోమం నిర్వహించారు. ఆలయాల్లో భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ధర్మకర్త ఉంగరాల సుబ్రహ్మణ్యశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ సదస్సులో వెటర్నరీ విద్యార్థి ప్రతిభ



అభినందిస్తున్న ఇన్‌చార్జి వీసీ జేవీరమణ, డీన్ వీరబ్రహ్మయ్య

తిరుపతిరూరల్, ఆగస్టు 17: ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో బీవీఎస్సీ నాల్గో సంవత్సర విద్యార్థి పి.నస్వర్‌ఖాన్ మలేషియాలో నిర్వహించిన ఆహార పరిశోధనా అంతర్జాతీయ సదస్సులో పాల్గొని ప్రతిభ చాటారు. పుత్రజయలోని పామ్‌గార్డెన్స్‌లో ఈనెల 6నుంచి 8వరకు నిర్వహించిన సదస్సుకు హాజరై తిరుపతిలో, సమీప ప్రాంతాల్లో సేకరించిన మీట్ శాంపిల్స్‌లో యాంటీ బయోగ్రామ్-స్టెఫిలోకాకస్ ఆరియస్ వ్యాప్తిపై పరిశోధనాపత్రాన్ని సమర్పించినట్లు పేర్కొన్నారు. దీనికిగాను విద్యార్థికి సర్టిఫికెట్ అందజేశారు. ప్రతిభచాటిన విద్యార్థిని ఇన్‌చార్జి వీసీ డాక్టర్ జేవీరమణ, డీన్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య అభినందించారు. ఈసందర్భంగా నస్వర్‌ఖాన్ మాట్లాడుతూ.. ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు సహకారం అందించిన ప్రొఫెసర్ జగదీశ్‌బాబు, ఏడీ డాక్టర్ జగపతిరామయ్య, డాక్టర్ శివశ్వేత, డాక్టర్ రమ్య, డాక్టర్ సురేష్, డాక్టర్ టీవీ చైతన్య, షర్మిలకు కృతజ్ఞతలు తెలిపారు.

## అయ్యన్నపాత్రుడికి సత్కారం



తిరుపతి రూరల్, ఆగస్టు17: తిరుపతి పర్యటనలో భాగంగా ఎస్వీ జూపార్కుకు వచ్చిన ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడిని టీడీపీ నేత, పుదిపట్ల సర్పంచ్ బడి సుధా యాదవ్ శనివారం మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువ, పుష్పగుచ్ఛంతో అభినందించారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో కలసి కొంతసేపు చంద్రగిరి పరిస్థితులపై చర్చించారు. స్పీకర్‌గా హుందాగా వ్యవహరిస్తూ సభాపతి పదవికి వన్నె తెస్తున్నారని గుర్తుచేశారు.


## విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనీయొద్దు



మాట్లాడుతున్న ఈఈ వాసురెడ్డి

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 17: గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ ఈఈ ఎస్.వాసురెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక పాత తిరుచానూరు రోడ్డులోని విద్యుత్ ఈఈ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఏడీఈ, ఏఈ, ఏఏవోలు, సబ్‌ఇంజనీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నిరంతరం చెట్టు కొమ్మలు తొలగించాలని ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్లు విఫలం కాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయరంగానికి, పరిశ్రమలకు విద్యుత్ సక్రమంగా సరఫరా చేయాలని ఆదేశించారు. విద్యుత్ ఛార్జీలను వందశాతం వసూలు చేయాలని ఆదేశించారు. వినియోగదారుల సమస్యలను ఉన్నత స్థాయి అధికారుల అనుమతులు తీసుకొని వెంటనే పరిష్కరించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈఈ హెచ్చరించారు. ఏడీఈలు సతీష్‌బాబు, నరేంద్ర, శేషారెడ్డి, పరిశుద్ధరావు, ఏఈలు జనార్థన్, బాలాజీ, రాజేష్, చెంచుకృష్ణయ్యలతోపాటు ఏఏవోలు ఏఈలు సబ్‌ఇంజనీర్లు పాల్గొన్నారు.

## తహసీల్దారుకు జనసేన సన్మానం



భాకరాపేట, ఆగస్టు 17: తహసీల్దారు జనార్దన్‌రాజును శనివారం జనసేన మండల అధ్యక్షుడు రూపేష్ కొమ్మిశెట్టి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జనసైనికులు అమాస సతీశ్, జయశంకర్, ప్రకాశ్, కేశవ, భాను, రాజశేఖర్, యశ్వంత్, చెంగయ్య, రామకృష్ణ, చెంగల్రాయులు, తదితరులు పాల్గొన్నారు.



చిన్నగొట్టిగల్లులో వైద్యులు, వైద్య సిబ్బంది నిరసన

## కోల్‌కతా ఘటనకు వ్యతిరేకంగా నిరసన

భాకరాపేట, ఆగస్టు 17: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అమానుష ఘటనకు వ్యతిరేకంగా ఐఎంఏ, వైద్యారోగ్య జేఏసీ పిలుపు మేరకు శనివారం చిన్నగొట్టిగల్లులోని వైద్యులు, వైద్య సిబ్బంది నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీధర్, మురళీమోహన్, సుజిత, యమునా, సిబ్బంది దినేశ్, భూలక్ష్మి, కమలమ్మ, అరుణ, వరలక్ష్మి, కృష్ణమూర్తి, శివ, అమరావతి, తదితరులు పాల్గొన్నారు.



## హత్యాచారానికి పాల్పడిన నిందితులను శిక్షించాలి

చంద్రగిరి, ఆగస్టు 17: కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యని నిరసిస్తూ.. శనివారం చంద్రగిరిలో వైద్యులు, వైద్యసిబ్బంది నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్, కొటాల పీహెచ్‌సీ డాక్టర్లు, వైద్యసిబ్బందితో కలసి టవర్‌క్లాక్ వద్ద ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలుపుతూ మానవహారం చేశారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.అరుణ మాట్లాడుతూ వైద్యుల రక్షణని ప్రభుత్వం బాధ్యతగా తీసుకోవాలని, మహిళా డాక్టర్‌పై హత్యాచారం చేసి, దారుణహత్యకి ఒడిగట్టిన మృగాలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ.. పనిచేసే ప్రదేశంలో భద్రత లేనప్పుడు మహిళలు ఏవిధంగా విధులు నిర్వహించగలరని నిలదీశారు. మహిళల భద్రతపట్ల ప్రభుత్వాలు కఠిన చట్టాలు చేయాలని, ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. డాక్టర్లు చంద్రమోహన్, పి.శ్రీసన్యశ్రీ, శ్రీలక్ష్మి, కవిత, స్వర్ణలత, రవీంద్రనాథ్ ఠాగూర్, కీర్తి, పావన్, షేక్ జీనత్, ప్రియాంక, కుసుమ, హెడ్‌నర్స్ కళావతి, ఎంపీహెచ్‌ఈవో ఈశ్వరయ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## జూపార్కుకు నిధులకోసం టీటీడీకి లేఖ రాస్తా

● శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు

మంగళం, ఆగస్టు 17: రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. రెండ్రోజుల పర్యటన నిమిత్తం తిరుపతికి వచ్చిన ఆయన శనివారం కుటుంబ సమేతంగా ఎస్వీ జూపార్కును సందర్శించారు. అక్కడ మొక్కను నాటాక కుటుంబీకులతో కలిసి బ్యాటరీ వాహనంలో జూపార్కులోని జంతువులను చూశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. 24 ఏళ్ల తర్వాత నేను జూపార్కును సందర్శిస్తున్నానని చెప్పారు. 'విశాఖలో జూపార్కు కన్నా ఎస్వీ జూపార్కు వార్షిక ఆదాయం బాగా పెరిగింది. ఇక్కడ సందర్శకులను ఆకర్షించడానికి కొత్త జంతువులను తీసుకురావాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో మరింత అభివృద్ధి చేసే దిశగా ఏడాదికి రూ.5కోట్లు ఇవ్వాలని టీటీడీకి లేఖ రాస్తా. గత వైసీపీ ప్రభుత్వం చెట్లను ఇష్టానుసారంగా నరికి వేసింది. దీన్ని భర్తీ చేయాలని కూటమి ప్రభుత్వం కోరుకుంటోంది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 14వేల పంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేసి, వాటి నిర్వహణ బాధ్యతలను డ్వాక్రా సంఘాలకు అప్పగించాలి. దీనిద్వారా సంఘాల మహిళలకు మరింత ఆదాయం వచ్చే అవకాశం కూడా ఉంది. దీనికోసం ప్రభుత్వం కొంత నిధులూ కేటాయించాలి. చెట్లు ఎక్కువగా ఉంటే పర్యావరణం బాగుంటుంది. జనం కూడా తమ మిద్దెలపై మొక్కలు పెంచడం మంచి పరిణామం. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో చర్చించి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా చేపడతాం' అని అయ్యన్నపాత్రుడు వివరించారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతిలో ఎన్నో చెట్లను నరికి వేయడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పట్లో శాంతిభద్రతలూ దెబ్బతిన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే ప్రశాంతమైన వాతావరణం ఏర్పడిందన్నారు. సీసీఎఫ్ నాగేశ్వరరావు, బయోట్రిమ్ సెల్వి కల్చరిస్టు యశోదబాయి, జూపార్కు క్యూరేటర్ సెల్వం, తిరుపతి జిల్లా అటవీశాఖ అధికారి సతీష్‌రెడ్డి, ఏసీఎఫ్ నాగభూషణం, అసిస్టెంట్ క్యూరేటర్ జగదీష్ చంద్రప్రసాద్, జూ డాక్టర్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



జూపార్కులో కుటుంబీకులతో అయ్యన్నపాత్రుడు

## సప్తగిరి భవనం ఆధునికీకరణకు చర్యలు తీసుకోండి

● అధికారులను ఆదేశించిన ఈవో శ్యామలరావు

తిరుమల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో సామాన్య భక్తులు బస చేసే అతిపెద్ద భవనమైన సప్తగిరి విశ్రాంతి భవనం ఆధునికీకరణకు చర్యలు తీసుకోవాలని టీటీడీ ఈవో శ్యామలరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి ఆయన శనివారం మధ్యాహ్నం తిరుమలలోని సప్తగిరి విశ్రాంతి భవన సముదాయం, సామాన్య భక్తులకు గదులు కేటాయించే సీఆర్వోలో తనిఖీలు నిర్వహించారు. ముందుగా సప్తగిరి విశ్రాంతి భవనంలోని కారిడార్లు, బాత్‌రూమ్, పరిశుభ్రత, స్విచ్‌బోర్డులు, జలప్రసాదం, పరుపులు, మంచాలు, బెడ్‌షీట్లను పరిశీలించారు. ఈవో మాట్లాడుతూ.. గదులను ఆధునికీకరించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. భక్తులతో సౌకర్యాలపై స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం సెంట్రల్ రిసెప్షన్ కార్యాలయం(సీఆర్వో)లో భక్తులకు గదుల కేటాయింపు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డు, ఇన్ఫర్మేషన్ కియోస్క్‌లను తనిఖీ చేశారు. అక్కడున్న భక్తులతో నేరుగా మాట్లాడి సౌకర్యాలు, ఇబ్బందులపై ఆరా తీశారు. భక్తుల సౌకర్యార్థం తిరుమలలో ఎన్ని గదులు అందుబాటులో ఉన్నాయనే సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రదర్శించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పీఏసీ(యాత్రికుల వసతి సముదాయాలు)లో ఎన్ని లాకర్లు అందుబాటులో ఉన్నాయో అనౌన్స్‌మెంట్ చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో సీవీఎస్వో శ్రీధర్, ఎస్‌ఈ2 సత్యనారాయణ, ఈఈలు వేణుగోపాల్, శ్రీనివాసులు, డీఈ చంద్రశేఖర్, డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, వీఎస్వోలు రామ్‌కుమార్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



సప్తగిరి విశ్రాంతి భవనంలో పరుపులను పరిశీలిస్తున్న ఈవో



రాకెట్, గ్రహసంచార, రోబో నమూనాలతో విద్యార్థులు

## ఐఐటీలో అంతరిక్ష దినోత్సవం

ఏర్పేడు, ఆగస్టు 17: శాస్త్ర సాంకేతిక రంగాల్లో విశిష్ట సేవలందించిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు ఇస్రో అధికారి డాక్టర్ మనీష్ సక్సేనా సూచించారు.జాతీయ అంతరిక్ష దినోత్సవ సందర్భంగా ఏర్పేడులోని ఐఐటీ టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్, నవవిష్కర్ ఐ-హబ్ ఫౌండేషన్ కలసి సెలబ్రేటింగ్ స్పేస్ అండ్ ఇంటర్‌స్టెల్లార్ ఫెస్ట్ ఫర్ స్కూల్ పేరుతో శనివారం ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు.26 ప్రైవేటు పాఠశాలలతోపాటు 6 ప్రభుత్వ పాఠశాలలనుంచి వెయ్యిమందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. బెంగళూరు ఇస్రో ప్రధాన కార్యాలయ శాటిలైట్ నావిగేషన్ ప్రోగ్రాం ఆఫీస్ డైరెక్టర్ డాక్టర్ మనీష్ సక్సేనా, శ్రీహరికోట ఎస్‌డీఎస్‌సీలోని పీసీక్యూఏ, సాలిడ్ మోటార్స్ ప్రొపెలెంట్ కాంప్లెక్స్ చీఫ్ జనరల్ మేనేజరు డాక్టర్ టీవీ రమణారెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనల గురించి వివరించారు. ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ,నవవిష్కర్ ఐహబ్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ రోషన్ శ్రీవాత్సవ నావిగేషన్ ప్రాముఖ్యతను వివరించారు. 80మంది విద్యార్థులు ప్రసంగ పోటీల్లో, 120మంది విద్యార్థులు క్విజ్ పోటీల్లో, 150మంది విద్యార్థులు డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్నారు.సౌరవ్యవస్థ, స్పేస్‌కాలనీ మోడల్, గ్రహాల వ్యవస్థ, కాంతి, నీడలపై తయారు చేసిన నమూనాలను ప్రదర్శించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఆదివారం బహుమతులను అందజేయనున్నారు.

## ఎమ్మెల్యే అనుచరులమంటూ కానిస్టేబుల్‌పై దాడి

● కేసు నమోదు చేసిన పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 17: అలిపిరిలో డ్యూటీలో వున్న కానిస్టేబుల్ బి.స్వయంప్రకాష్‌పై శుక్రవారం అర్ధరాత్రి కొంతమంది దౌర్జన్యం చేశారు. దీనిపై ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. అలిపిరిలో కానిస్టేబుళ్ల స్వయంప్రకాష్, చంద్రశేఖర్ శుక్రవారం రాత్రి డ్యూటీ చేస్తుండగా నెంబరు లేని ఎన్‌ఫీల్డ్ బుల్లెట్‌లో నలుగురు తిరుమల బైపాస్ రోడ్డులోని మున్సిపల్ పార్కు నుంచి అలిపిరి స్టేషన్ వైపు వెళుతున్నారు. అనుమానంతో బుల్లెట్‌ను ఆపి తనిఖీ చేస్తే వాహనానికి సంబంధించి నెంబరు ప్లేటు లేకపోవడంతో ఆర్‌సీ, లైసెన్సు అడగ్గా కానిస్టేబుళ్లకు చూపించలేదు. పైగా బండిపై వున్న మహేంద్ర, కమలాకర్, మురళిలు కానిస్టేబుళ్లను దుర్భాషలాడారు. దీంతో వాహనాన్ని తీసుకెళ్లి అలిపిరి స్టేషన్‌లో అప్పగించిన కానిస్టేబుళ్లు రాత్రి డ్యూటీలపై వెళ్లిపోయారు. ఇంతలో మళ్లీ స్టేషన్ వద్దకు వచ్చిన వారు 'మా బండి మాకు ఇవ్వండి.. మేము ఎమ్మెల్యే అనుచరులం' అంటూ దుర్భాషలాడారు. ఈ విషయం తెలిసిన ఎస్పీ వెంటనే వారిపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్ ఇచ్చి విడుదల చేసినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ చెప్పారు. కానిస్టేబుళ్లపై దౌర్జన్యం చేసిన వారు చిత్తూరుకు చెందిన మహేంద్ర, కమలాకర్, తిరుపతి పెద్దకాపులేఅవుట్‌కు చెందిన జిమ్ మురళిగా పోలీసులు గుర్తించారు. చిత్తూరు మేయర్ కఠారి అనురాధ హత్య కేసులో నిందితుడిగా వుండిన కమలాకర్ ఇటీవల ఎన్నికల సమయంలో తిరుపతికి చేరాడని ఎస్‌ఐ రాజశేఖర్ చెప్పారు.

## శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 12వేల ఎకరాల భూమి కబ్జా

● బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్

మంగళం, ఆగస్టు 17: 'రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ హయాంలో అసైన్డ్, చుక్కల భూములను ఫ్రీహోల్డ్ (కొనుగోలుకు చట్టబద్ధత చేసుకుని) ద్వారా వేల ఎకరాల కబ్జా చేశారు. ఒక్క శ్రీకాళహస్తి నియోజకవర్గంలోనే 12వేల ఎకరాలు కబ్జా చేశారు. ఇందులో ఆరు వేల ఎకరాలకు పక్కా ఆధారాలు 'సేకరించాం' అని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రెండు నెలల్లో వైసీపీ నాయకులు రాయలసీమ పరిధిలో ఆరు జిల్లాల్లో 18వేల ఎకరాల కబ్జా చేశారని నిర్ధారణ అయిందన్నారు. ఇందులో ఒక్క శ్రీకాళహస్తిలోనే 12వేల ఎకరాలు కబ్జాకు గురికావడం ఆశ్చర్యాన్ని కల్గించిందన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సహకారంతోనే ఈ కబ్జాలు జరిగాయన్నారు. జగనన్న ఇళ్ల పట్టాల కోసం జరిగిన భూసేకరణలో పెద్ద దందా చేశారన్నారు. పేదవారి దగ్గర ఎకరా రూ.ఐదు లక్షలకు కొనుగోలు చేసి.. తమకు కావాల్సిన వారికి కట్టబెట్టి ప్రభుత్వ నష్టపరిహారం కింద రూ.50లక్షలు కొట్టేశారన్నారు. శ్రీకాళహస్తిలోని రాజీవ్‌నగర్‌లో నకిలీ ఎన్‌వోసీలు ఇచ్చి భూదందా చేశారన్నారు. ఇందులో మాజీ సీఎం జగన్ వ్యక్తిగత కార్యదర్శి ధనంజయ రెడ్డి, అప్పటి కలెక్టర్ వెంకటరమణారెడ్డి, సబ్ రిజిస్ట్రార్, వీఆర్వోలు ఉన్నారన్నారు. రేణిగుంట మండలం అన్నస్వామిపల్లిలో అయితే దాదాపు రూ.వెయ్యికోట్ల భూదందా చేశారన్నారు. వీటన్నింటిపై విచారణ జరుగుతోందని.. త్వరలోనే దీనివెనకున్న వారంతా జైలుకు పోవడం ఖాయమన్నారు. అలాగే వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, ఢిల్లీ పెద్దలను కోరతామని తెలిపారు. ఈ అంశంపై సీబీఐ విచారణా చేపట్టాలన్నారు. బీజేపీ నాయకులు సామంచి శ్రీనివాస్, డాక్టర్ శ్రీహరిరావు, సుబ్రహ్మణ్యంరెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న కోలా ఆనంద్

## చేపల చెరువుల వేలం

భాకరాపేట, ఆగస్టు 17: మండలంలోని నెల్లుట్లవారిపల్లె పంచాయతీలోని మూడు చెరువులకు శనివారం నిర్వహించిన వేలం పాటల ద్వారా రూ.3.54 లక్షల ఆదాయం వచ్చినట్లు ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో సోమశేఖరరెడ్డి తెలిపారు. నెల్లుట్లవారిపల్లె పంచాయతీలోని బొమ్మాయి చెరువును పి.రామకృష్ణ రూ.98,500లకు, పడాలమ్మ చెరువును వి.సత్యనారాయణరెడ్డి రూ.1,86,000లకు, రెడ్డిచెరువును బి.వెంకటరామయ్య రూ.70,000లకు దక్కించుకున్నట్లు ఆయన చెప్పారు. సర్పంచు ఎం.శశిప్రియ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలం పాటల్లో గ్రామ కార్యదర్శులు వెంకటేశ్వరరావు, మదనమోహనరాజు, వెంకటమోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వరి పంటపై ఏనుగుల దాడులు



ఎర్రావారిపాలెం, ఆగస్టు 17: పంట పొలాలపై ఏనుగులు దాడులు చేస్తుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రతి ఏటా వేసవిలో మామిడి పంటలను ధ్వంసం చేసే గజరాజులు ఈ ఏడాది వర్షాకాలంలో కూడా వరి పంటలపై దాడులు చేస్తున్నాయి. మండలంలోని కోటకాడపల్లె పంచాయతీకి చెందిన రైతు లక్ష్మీనారాయణ రెండెకరాల వరి పంట సాగుచేశాడు. పంట సన్న కరుకు దశలో ఉంది. శనివారం వేకువ జామున ఏనుగుల గుంపు వరి పంటను తొక్కి ధ్వంసం చేశాయి. పొలానికి చుట్టూ ఉన్న ఇనుప కంచెనూ ధ్వంసం చేశాయి. ఈ పొలాన్ని మండల బీజేపీ అధ్యక్షుడు ప్రతాప్, నాయకుడు పురుషోత్తం పరిశీలించారు. ఫారెస్టు అధికారులు పంట నష్టపోయిన రైతుకు పరిహారం వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

## టీటీడీ పరిపాలనా భవనంలో ఎస్పీ పరిశీలన

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 17: టీటీడీ పరిపాలనా భవనంలోని బైపాస్ రోడ్ల విభాగం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో శనివారం అగ్నిప్రమాదం జరిగిన స్థలాన్ని ఎస్పీ సుబ్బరాయుడు శనివారం రాత్రి పరిశీలించారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విజిలెన్సు అధికారులు తెలిపిన వివరాలను నమోదు చేసుకుని కేసు నమోదు చేసి, లోతుగా దర్యాప్తు చేయాలని డీఎస్పీ వెంకటనారాయణను ఆదేశించారు. దీంతో ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

రేణిగుంట, ఆగస్టు 17: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శనివారం రేణిగుంట విమానాశ్రయంలో ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి భద్రత ఏర్పాట్లపై వివిధ శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 19న ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనలో భద్రతాపరమైన అంశాల్లో ఎలాంటి రాజీ లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీలు కులశేఖర్, విమలకుమారి, ఆర్డీవో కిరణ్ కుమార్, జోనల్ మేనేజరు ఏపీఐఐసీ చంద్రశేఖర్, ఫైర్ అధికారి రమణయ్య, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

## జగన్ చెయ్యెత్తినా మాట్లాడే అవకాశమిస్తా

### చింతకాయల అయ్యన్నపాత్రుడు

మంగళం, ఆగస్టు 17: మాజీ ముఖ్యమంత్రి జగన్ అసెంబ్లీ సమావేశాలకు హాజరై చెయ్యి పైకి ఎత్తినా ఆయనకు మాట్లాడే అవకాశం ఇస్తానని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చెప్పారు.తిరుపతిలోని ఎస్వీ జూపార్కును శనివారం సందర్శించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ శాసనసభలో 88మంది కొత్త ఎమ్మెల్యేలు ఉన్నారని, వారందరికీ సభలో ఎలా మాట్లాడాలి ఏ అంశాలపై మాట్లాడాలి అనే విషయాలతోపాటు ఎలా ప్రవర్తించాలన్నదానిపై కూడా అవగాహన కల్పించడానికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గత అసెంబ్లీ సమావేశాల్లోనే సభ్యులు అనేక అంశాలను ప్రస్తావించారన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు కూడా శాసనసభ సమావేశాలకు హాజరై ప్రజల సమస్యలను తెలియజేయడానికి ముందుకు వస్తే వారికి కూడా మాట్లాడేందుకు అవకాశం ఇస్తామని స్పీకర్ స్పష్టం చేశారు.

## 8న 'సర్వేపల్లి రాధాకృష్ణన్' అవార్డుల ప్రదానం

మంగళం, ఆగస్టు 17: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజాసేవకు అంకితమైన వారిని ఎంపిక చేసి సెప్టెంబరు 8న సర్వేపల్లి రాధాకృష్ణన్ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ స్వర్ణ నంది అవార్డులు తిరుపతిలో ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు సరోజనమ్మ శనివారం మీడియాకు తెలిపారు. ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు, విద్య, వైద్య, కవులు, కళాకారులు, రాజకీయ, వ్యాపార వేత్తలు, సంగీత, నాట్య కళాకారులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు పలు సాంఘిక, సాంస్కృతిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో అంకితమైనవారు ఈనెల 26వ తేదీలోపు తమ నామినేషన్లను 63029 08528 నెంబర్‌కు పంపాలని కోరారు. వీరిలో 50మందిని ఎంపిక చేసి అవార్డులు అందజేస్తామన్నారు. ఖాదర్‌బాషా, యోగేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న సరోజనమ్మ

# గిరిజనుల సంక్షేమానికి కృషి చేయండి

● అధికారులకు సూచించిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు



సమావేశంలో ప్రసంగిస్తున్న హుస్సేన్

తిరుపతి(విద్య), ఆగస్టు 17: గిరిజనులు, సంచార జాతుల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాతోతు హుస్సేన్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. దీనికిముందు హుస్సేన్‌కు కలెక్టర్ వెంకటేశ్వర్ సాదర స్వాగతం పలికారు. అనంతరం జేసీ శుభం బన్సల్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, డీఆర్వో పెంచల కిషోర్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సూర్యనారాయణతో కలిసి సమీక్షించారు. ఎస్సీ, ఎస్టీలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చదువుకునేలా అధికారులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. గిరిజన ఏకలవ్య హాస్టళ్లలో విద్యార్థులకు రక్షిత తాగునీరు, పారిశుధ్యం పరిశుభ్రమైన ఆహారం మెనూ ప్రకారం అందించాలని ఆదేశించారు. దెబ్బతిన్న గిరిజన హాస్టళ్లు, పాఠశాలలను మరమ్మతులు చేయించాలని చెప్పారు. జిల్లాలో గిరిజనుల భూ సమస్యలు చాలా వరకు పెండింగ్‌లో ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. వీటిని త్వరగా పరిష్కరించి, నివేదిక పంపించాలని సూచనలిచ్చారు. జిల్లాలో అన్ని వసతులతో గిరిజన భవన్‌ను తీర్చిదిద్ది గిరిజన సంఘాలకు అప్పగించాలన్నారు.

## సాహిత్యంలో సామాజిక స్పృహ ఉండాలి



సాహితీ పురస్కారాలతో గ్రహీతలు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 17: సామాజిక స్పృహ కలిగినదే అసలు సిసలైన సాహిత్యమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య మధురాంతకం నరేంద్ర అన్నారు. శనివారం ఉదయం ప్రముఖ కథారచయిత కేవీ మేఘనాథ్ రెడ్డి రచించిన నవల పాయిదరువులు ఆవిష్కరణ, శివేగారి దేవమ్మ కథా పురస్కారం, బాపురం గురురాజారావు కవితా పురస్కార ప్రదాన సభ జరిగింది. స్థానిక బైరాగిపట్టెడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో నిర్వహించిన ఈ సభలో ఆయన మాట్లాడుతూ.. నేటితరం వారిలో పుస్తకాలు చదివే ఆసక్తి తగ్గిపోతోందన్నారు. తెలుగులో సాహిత్యం కోసం ఒక ప్రత్యేక పత్రిక లేకపోవడం కూడా పరిస్థితికి అద్దం పడుతోందన్నారు. నవలా రచయితగా మేఘనాథ్ రెడ్డి వంటి యువరచయితలు రావడం ఎంతో శుభ పరిణామమన్నారు. విశిష్ట అతిథి, ఆచార్య కె.మధుజ్యోతి (బెంగళూరు వర్సిటీ) మాట్లాడుతూ.. యువ రచయితలు తమ సాహిత్యంలో సమకాలీన సమస్యలను చిత్రీకరిస్తున్నారని, ఇవి వాస్తవికతను ప్రతిబింబిస్తున్నాయని ప్రశంసించారు. అనంతరం కేవీ మేఘనాథ్ రెడ్డి రచించిన నవల పాయిదరువులు ఆవిష్కరణతోపాటు శివేగారి దేవమ్మ కథాపురస్కారం (2023)ను మునిసురేష్ పిళ్లై, ఆర్సీ కృష్ణస్వామి రాజులకు, బాపురం గురురాజారావు కవితా పురస్కారం (2020)ను కూచిమంచి నాగేంద్రకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి పలమనేరు బాలాజి, సాహితీవేత్తలు సీఎస్ చంద్రశేఖర్, పల్లిపట్టు నాగరాజు, సాకం నాగరాజు, జిల్లేళ్ల బాలాజి, మౌని, కొత్వాలు అమరేంద్ర, జి.రమేష్ బాబు పాల్గొన్నారు.

## బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేయాలి

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 17: బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేయాలని సీనియర్ న్యాయవాది ఎం.బాలాజి తెలిపారు. శనివారం ఆయన అలిపిరి డిపోలోని డ్రైవింగ్ స్కూల్లో శిక్షణ పొందుతున్న 28వ బ్యాచ్ విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. డీఎం హరిబాబు పాల్గొన్నారు.

## ఉపరాష్ట్రపతికి ఘన స్వాగతం



ఉపరాష్ట్రపతికి శ్రీవారి ప్రతిమను అందజేస్తున్న మంత్రి ఆనం, కలెక్టర్

రేణిగుంట, ఆగస్టు 17: ఉపరాష్ట్రపతి జగదీష్ ధన్కడ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో శనివారం ఉదయం ఘన స్వాగతం లభించింది. నెల్లూరు జిల్లాలో అక్షర విద్యాలయ క్యాంపస్, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం, స్వర్ణభారత్ ట్రస్టు 23వ వార్షికోత్సవంలో పాల్గొనేందుకు ఢిల్లీ నుంచి ఉప రాష్ట్రపతి దంపతులు ప్రత్యేక విమానంలో ఉదయం 9.35గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరు కున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో నెల్లూరుకు బయలుదేరి వెళ్లారు. అక్కడ కార్యక్రమం ముగిశాక మధ్యాహ్నం 2.08గంటలను రేణిగుంట విమా నాశ్రయం చేరుకుని ప్రత్యేక విమానంలో ఉపరాష్ట్రపతి దంపతులు ఢిల్లీకి తిరుగుపయనం అయ్యారు. ఆయనకు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఐజీ రాజుకుమార్ మీనా, డీఐజీ షిమోషి బాజ్‌పాయ్, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, తిరుపతి నగర మేయర్ శిరీష, కస్తూర్బా కేంద్ర ట్రస్టు చైర్మన్ పీసీ రాయలు స్వాగతం, వీడ్కోలు పలికారు.

## పూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు



తిరుమల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో మూడ్రోజులపాటు జరిగిన పవిత్రోత్సవాలు శనివారం పూర్ణాహుతితో ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం యాగశాలలో ఋత్వికులు హోమాలు నిర్వహించారు. తర్వాత శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం చేపట్టారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపుతో అభిషేకించి చివరగా చందనం పూత పూశారు. ధూపదీప హారతులు నివేదించారు. సాయంత్రం ఉత్సవమూర్తులు ఆలయ మాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. ఆ తర్వాత పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం విమాన ప్రదక్షిణగా ఉత్సవమూర్తులు ఆలయ ప్రవేశం చేయడంతో పవిత్రోత్సవాలు ముగిశాయి. ఈకార్యక్రమ నేపథ్యంలో ఆలయంలో కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది. టీటీడీ జీయర్ స్వాములు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, డిప్యూటీఈవో లోకనాథం ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అమానవీయం

### జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం ఘటనపై నిరసనలు



నిరసనలో పాల్గొన్న విద్యార్థులు, ఉద్యోగులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 17: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటన అమానవీయమైనదని పద్మావతి మహిళా యూనివర్సిటీ విద్యార్థులు, ఉద్యోగులు అభిప్రాయపడ్డారు. ఉమెన్ సేఫ్టీ సెంటర్ - ఉమెన్ స్టడీస్ సంయుక్తంగా శనివారం సాయంత్రం నిరసన ర్యాలీ నిర్వహించారు. బోధన, బోధనేతర ఉద్యోగులు, విద్యార్థులు స్వచ్ఛందంగా ఈ ర్యాలీకి హాజరయ్యారు. కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించాక వైద్యురాలి మృతిపై మౌనం పాటించి, సంతాపాన్ని తెలియచేశారు. ఈ ఘటన దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఇలాంటి వాటిని ప్రతిఘటించాల్సిన అవసరం ఉందన్నారు. బాధ్యులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ సైన్స్ డీన్లు వాణి, సుజాత, వార్డెన్ సావిత్రి, ఉమెన్ సేఫ్టీ సెంటర్ డైరెక్టర్ సీతాకుమారి, ఉమెన్ స్టడీస్ హెడ్ నీరజ, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

**ఎస్వీ ఆయుర్వేద కళాశాలలో..**



తిరుపతి(వైద్యం): హత్యాచార ఘటనపై ఎస్వీ ఆయుర్వేద కళాశాల, ఆస్పత్రిలోని వైద్య విద్యార్థులు.. ప్రిన్సిపాల్ రేణుదీక్షిత్, ప్రొఫెసర్ విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. ఇంతటి దారుణానికి పాల్పడిన నిందితులను, ఇందుకు బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక చట్టాలపై ఉద్యమిద్దాం



సమావేశంలో ప్రసంగిస్తున్న రవి

తిరుపతి(లీగల్), ఆగస్టు 17: ప్రజావ్యతిరేక చట్టాలపై ప్రజలను చైతన్యం చేసి.. ఉద్యమించాలని పలు న్యాయవాద సంఘాలు పిలుపునిచ్చాయి. యూత్ హాస్టల్లో శనివారం ప్రజావ్యతిరేక చట్టాలపై కాంగ్రెస్ లీగల్‌సెల్, ఆలిండియా లాయర్స్ యూనియన్, ఇండియన్ లాయర్స్ అసోసియేషన్, ఇండియన్ అసోసియేట్ లాయర్స్, బీసీ న్యాయవాదుల సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ లీగల్ సెల్ అధ్యక్షుడు బి.రవి మాట్లాడుతూ.. ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసే చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర కార్యదర్శి వై.షణ్ముగయాదవ్ మాట్లాడుతూ.. కొత్త చట్టాలతో పోలీసులకు అధికారాలు పెంచి, కోర్టులకు అధికారాలు తగ్గించడం అంటే ప్రజల హక్కులు కాలరాయడమేనన్నారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పత్తికొండ మురళి మాట్లాడుతూ.. ఈనెల 24న విజయవాడలో కొత్త చట్టాలపై జరిగే నిరసన కార్యక్రమంలో ప్రజాసంఘాలు, న్యాయవాద సంఘాలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఐఎల్ఏ జిల్లా కన్వీనర్ బోకం రమేష్, బీసీ న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంయాదవ్, ఊటుపల్లె లక్ష్మన్న, గిరిబాబు, వెంకటేష్, అజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలలో హాకర్ల మధ్య ఘర్షణ



ఘర్షణకు దిగిన శ్రీకాంత్, శ్రీనివాస్

తిరుమల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఇద్దరు హాకర్లు గాజు బాటిళ్లతో పరస్పరం దాడి చేసుకుంటూ వీరంగం సృష్టించారు. వ్యాపార విషయంలో మొదలైన గొడవ పెరిగి తీవ్రంగా గాయపరుచుకునేంతవరకు వెళ్లింది. రక్తగాయాలతో పెద్ద పెద్ద కేకలు వేస్తూ వారు చేసిన వీరంగానికి భక్తులు భయభ్రాంతులకు గురయ్యారు. నల్గొండకు చెందిన శ్రీకాంత్, తిరుపతికి చెందిన శ్రీనివాస్ తిరుమలలోని నందకం విశ్రాంతి భవనం ముందు అనధికారికంగా భక్తులకు షాంపూలు, సోపులు, బ్రష్‌లు వంటివి విక్రయిస్తుంటారు. నా స్థానంలో నువ్వు వ్యాపారం చేస్తున్నావని ఒకరు, నేను అమ్మే వస్తువులు నువ్వు ఎలా విక్రయిస్తావని మరొకరు గొడవకు దిగారు. కొద్దిసేపు వీరిద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సహనం కోల్పోయిన ఇద్దరూ పక్కనే ఉన్న ఓ డెయిరీ పార్లర్ వద్ద గాజు బాటిళ్లను తీసుకుని దాడులు చేసుకున్నారు. ఇద్దరికి తీవ్రస్థాయిలో రక్తగాయాలయ్యాయి. ఈ క్రమంలో అక్కడున్న భక్తులు హడలిపోయారు. సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ సత్యనారాయణ సిబ్బందితో కలిసి ఘటనా ప్రాంతానికి చేరుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్‌ను తిరుపతి రుయాస్పత్రికి తరలించారు.

## హాథీరాంజీ భూములకు రక్షణ కల్పించండి



హుస్సేన్‌ను సన్మానిస్తున్న నవీన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి (జీవకోన), ఆగస్టు 17: హాథీరాంజీ భూములకు రక్షణ కల్పించాలని జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ జాతోతు హుస్సేన్‌ను బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి కోరారు. పద్మావతి అతిథి గృహంలో శనివారం ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. తిరుమల శ్రీవారితో పాచికలు ఆడిన చరిత్ర ఉన్న బావాజీకి సంబంధించిన కోట్లాది రూపాయలు విలువ చేసే వందలాది ఎకరాల భూములు.. రాజకీయ నాయకుల కబంధ హస్తాల్లో ఉన్నాయన్నారు. దీనిపై సమగ్రమైన సమాచారాన్ని త్వరలో అందిస్తామని చెప్పారు. టీటీడీలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఎస్టీ ఉద్యోగులకు గత ప్రభుత్వంలో జరిగిన అన్యాయాలపై విచారణ చేసి.. అర్హతను బట్టి పదోన్నతులు కల్పించాలన్నారు. తిరుమల హాథీరాంజీ మఠంలో మరింత మెరుగైన సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

## పచ్చదనం, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం



కార్యక్రమంలో పాల్గొన్న రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 17: పచ్చదనం - పరిశుభ్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని ఎస్వీయూ రిజిస్ట్రార్ మాదాల భూపతి నాయుడు తెలిపారు. పచ్చదనం - పరిశుభ్రత కార్యక్రమాన్ని శనివారం యూనివర్సిటీలో నిర్వహించారు. సుదీర్ఘ చరిత్ర కల్గిన యూనివర్సిటీలో ఎంతో విలువైన చెట్లు, మొక్కలు ఉన్నాయన్నారు. వీటిని సంరక్షించుకోవడంతో పాటు పచ్చదనాన్ని మరింతగా పెంపొందించాల్సిన ఆవశ్యకత ఉందని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 17: తిరుపతి సమీప ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు శ్రీగాయత్రి టెక్నాలజీ కరస్పాండెంట్ రామచంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పొందినవారికి ఉపాధి లభించేలా చర్యలు కూడా తీసుకుంటామని పేర్కొన్నారు.



## వ్యాసరచన పోటీకి స్పందన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 17: పద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు విభాగంలో నిర్వహించిన వ్యాసరచన పోటీకి విశేష స్పందన వచ్చింది. మాలతీ చందూర్ నవలలు - మహిళా చైతన్యం అంశంపై నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలను తెలుగు విభాగాధిపతి కొలకలూరి మధుజ్యోతి, అధ్యాపకులు డాక్టర్ సుభాషిణి, డాక్టర్ యువశ్రీ పర్యవేక్షించారు. విజేతలకు ఈనెల 20వ తేదీ నిర్వహించే మాలతీ చందూర్ స్మారక సదస్సులో బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు.

## ఎస్వీయూలో 128 మంది బోధనేతర ఉద్యోగుల బదిలీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 17: ఎస్వీయూలో 128 మంది బోధనేతర ఉద్యోగులను బదిలీ చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులను రిజిస్ట్రార్ మాదాల భూపతి నాయుడు శనివారం జారీ చేశారు.

## ఏపీయూడబ్ల్యూజే వార్షికోత్సవం

మంగళం, ఆగస్టు 17: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (ఏపీయూడబ్ల్యూజే) 67వ వార్షికోత్సవాలు తిరుపతిలో శనివారం ఘనంగా జరిగాయి. యూనియన్ కార్యాలయంలో వ్యవస్థాపకుడు మానికొండ చలపతిరావు చిత్రపటానికి పూలమాలలువేసి, నివాళి అర్పించారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పి.నరేంద్ర, ఆర్గనైజింగ్ కార్యదర్శి మబ్బు నారాయణరెడ్డి, సహాయ కార్యదర్శులు నరసింహారెడ్డి, పద్మనాభం, జోసెఫ్, కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, బి.రాజు, శ్రీరాజు, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గిరిబాబు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాధాకృష్ణ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు అరసం కవితా స్రవంతి పుస్తకాల ఆవిష్కరణ

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 17: అరసం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు ఈతరం కోసం.. అరసం కవితాస్రవంతి పుస్తకాల ఆవిష్కరణ సభ జరుగుతుంది. బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవనంలో జరిగే ఈ కార్యక్రమానికి విశ్రాంత తెలుగు ఆచార్యుడు కడియాల వెంకటరమణ అధ్యక్షత వహిస్తారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, జాతీయ సమితి అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య మధురాంతకం నరేంద్ర, విశ్రాంత ఆచార్యుడు మేడిపల్లి రవికుమార్, అరసం రాష్ట్ర నాయకులు సాకం నాగరాజ, అరసం చిత్తూరు జిల్లా కార్యదర్శి గంటా మోహన్, కథా రచయిత మూరిశెట్టి గోవిందు, అరసం తిరుపతి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యువశ్రీ మురళి, నెమిలేటి కిట్టన్న పాల్గొంటారు. సోమసుందర్ కవిత, నాగభైరవ కోటేశ్వరరావు కవిత, ఆలూరి బైరాగి కవిత, గరిమెళ్ల సత్యనారాయణ కవిత అనే నాలుగు పుస్తకాలను ఆవిష్కరిస్తారు.

## ఆరణి మదన్ జన్మదిన వేడుకలు



కుమారుడు మదన్‌కు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే ఆరణి దంపతులు

తిరుపతి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తనయుడు మదన్ జన్మదిన వేడుకలు శనివారం నగరంలో ఘనంగా జరిగాయి. తొలుత గంగమ్మను దర్శించుకున్న అనంతరం తన నివాసం వద్ద జరిగిన వేడుకల్లో తల్లిదండ్రుల ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం జనసేన నాయకులు ఏర్పాటుచేసిన వేడుకల్లో పాల్గొని కేక్ చేసి, పంచి పెట్టారు. జీవకోనలో విద్యార్థులకు బుక్స్, ప్యాడ్ అందజేశారు. రుయాస్పత్రి ముందు తిరుపతి జనసేన నాయకుడు చెరుకుల నీలాద్రి ఆధ్వర్యంలో 500మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి మదన్ హాజరయ్యారు. ఆముదాల తులసి, ప్రభాకర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు. కాగా విష్ణునివాసం ముందు ఆటో ట్యాక్సీ యూనియన్ల అధ్యక్షుడు రాజేష్‌యాదవ్ ఆధ్వర్యంలో, అలిపిరి గరుడా సర్కిల్ వద్ద దినేష్ జైన్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు.జనసేనతోపాటు టీడీపీ, బీజేపీకి చెందిన నాయకులు ఈసందర్భంగా మదన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## వైద్య సేవలు అభినందనీయం

● మంత్రి బాల వీరాంజనేయులు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 17 : ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు వైద్యసేవలు అందించడం అభినందనీయమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయులు అన్నారు. పట్టణంలోని ఏఎల్‌సీఎం క్రీడా మైదానంలో మాజీ మంత్రి డాక్టర్ పరసారత్నం సతీమణి కస్తూరిరత్నం 4వ వర్ధంతి నిర్వహించారు. ముందుగా కస్తూరిరత్నం చిత్రపటానికి మంత్రి బాల వీరాంజనేయులు, ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తదితరులు నివాళులర్పించారు. ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పాశిం సునీల్‌కుమార్, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, సత్యవేడు మాజీ ఎమ్మెల్యే సూరజ్, శ్రీకాళహస్తి జనసేన పార్టీ ఇన్‌చార్జి వినిత, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, వేనాటి సతీష్‌రెడ్డి, శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, 786 రఫీ, నారాయణ వైద్యశాల హెచ్‌ఆర్ సునందరావు, శ్రీధర్, అనిల్ పాల్గొన్నారు.

## యాకసిరి విద్యా కమిటీ ఎన్నిక వాయిదా

చిట్టమూరు, ఆగస్టు17: యాకసిరి ఉన్నత పాఠశాల విద్యాకమిటీ ఎన్నిక కోరం లేనందున శనివారం రెండవ సారి వాయిదా పడింది. ఇక్కడ వైసీపీ, టీడీపీ మధ్య గట్టి పోటీ ఉండడంతో వాయిదాకు కారణమైంది. ఈనెల 8న జరిగిన విద్యా కమిటీ ఎన్నికల్లో విద్యార్థినే తల్లి పేరును నమోదు చేయడం, మరో తరగతిలో ఒకే పేరున రెండుసార్లు సూచించడంతో టీడీపీ వర్గీయులు అభ్యంతరం వ్యక్తంచేశారు. దీంతో ఎన్నికలు వాయిదా వేశారు. శనివారం కూడా తల్లిదండ్రులు రాకపోవడంతో కోరం లేక వాయిదా పడింది.

## వంజివాకలో చోటీ బచావో... చోటీ పడావో...

కోట, ఆగస్టు 17 : మండల పరిధిలోని వంజివాక ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో శనివారం చోటీ బచావో... చోటీ పడావో కార్యక్రమం జరిగింది. సూపర్‌వైజర్ కృష్ణమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పుస్తకాలు మోసే వయసులో పెళ్లి వద్దని, 18ఏళ్లలోపు ఆడపిల్లలకు, 21ఏళ్లలోపు మగపిల్లలకు పెళ్లిచేయడం నేరమని, ప్రోత్సహించేవారిపై చర్యలు తీసుకుంటామంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ సునీల, అంగన్‌వాడీ వర్కర్లు శ్రీవిద్య, అనిత, సరోజనమ్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.

## దళితులను అడ్డుపెట్టుకుని జగన్ రెడ్డి దగా

### మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ విమర్శ



తిరుపతి, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలంటూ కులాలను విచ్ఛిన్నం చేశారని, దళితులపై దొంగ ప్రేమ నటించి చివరికి మొండి చేయి చూపించారని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదరావు మండి పడ్డారు.తిరుమల శ్రీవారిని శనివారం ఉదయం దర్శించుకున్న ఆయన అనంతరం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ఖూనీ కోర్, కబ్జాకోర్, ముండాకోర్లతో వైసీపీ రాజకీయాలు చేసిందని, అలాంటివారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్ని దళిత సంఘాలూ కలిసి వైసీపీ ప్రభుత్వ అరాచకాలపై, కోర్టులను ఆశ్రయించాలని పిలుపునిచ్చారు.దళితులపై అత్యాచారాలు, హత్యలు చేసిన వారిని ప్రజాప్రతినిధులుగా జగన్ రెడ్డి కొనసాగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మాల,మాదిగలంతా అన్నదమ్ములన్నారు. వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఆశాజనకంగా ఉందని తెలిపారు. ఇది ఎవరి గెలుపూ కాదని, రాజ్యాంగం గెలుపని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం దళితులకు మంచి చేస్తుందని కొనియాడారు. జనాభా ప్రాతిపదికన అధిక జనాభా ఉన్న మాలలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మాజీ మంత్రి చింతా మోహన్ వర్గీకరణకు వ్యతిరేకంగా మాట్లాడుతుండడంపై మీడియా అడగ్గా... విభజిత ఆంధ్రలో మాలలకే ఎక్కువ అవకాశాలు ఉంటాయన్నారు. వర్గీకరణపై సుప్రీం ఇచ్చిన తీర్పు ఇచ్చిన నేపథ్యంలో శ్రీవారికి మొక్కు తీర్చుకోవడానికి తిరుమలకు వచ్చానని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. టీడీపీ నాయకులు పీసీ స్వామి, వాలముని , గంగాధరం , రామచంద్ర, బాలాజీ, సుబ్బయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జూపార్కుకు నిధులకోసం టీటీడీకి లేఖ రాస్తా

### - శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు



కుటుంబీకులతో అయ్యన్నపాత్రుడు

మంగళం, ఆగస్టు 17: రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. రెండ్రోజుల పర్యటన నిమిత్తం తిరుపతికి వచ్చిన ఆయన శనివారం కుటుంబ సమేతంగా ఎస్వీ జూపార్కును సందర్శించారు. అక్కడ మొక్కను నాటాక కుటుంబీకులతో కలిసి బ్యాటరీ వాహనంలో జూపార్కులోని జంతువులను చూశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. 24 ఏళ్ల తర్వాత నేను జూపార్కును సందర్శిస్తున్నానని చెప్పారు. 'విశాఖలో జూపార్కు కన్నా ఎస్వీ జూపార్కు వార్షిక ఆదాయం బాగా పెరిగింది. ఇక్కడ సందర్శకులను ఆకర్షించడానికి కొత్త జంతువులను తీసుకురావాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో మరింత అభివృద్ధి చేసే దిశగా ఏడాదికి రూ.5కోట్లు ఇవ్వాలని టీటీడీకి లేఖ రాస్తా. గత వైసీపీ ప్రభుత్వం చెట్లను ఇష్టానుసారంగా నరికివేసింది. దీన్ని భర్తీ చేయాలని కూటమి ప్రభుత్వం కోరుకుంటోంది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 14వేల పంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేసి, వాటి నిర్వహణ బాధ్యతలను డ్వాక్రా సంఘాలకు అప్పగించాలి. దీనిద్వారా సంఘాల మహిళలకు మరింత ఆదాయం వచ్చే అవకాశం కూడా ఉంది. దీనికోసం ప్రభుత్వం కొంత నిధులూ కేటాయించాలి. చెట్లు ఎక్కువగా ఉంటే పర్యావరణం బాగుంటుంది. జనం కూడా తమ మిద్దెలపై మొక్కలు పెంచడం మంచి పరిణామం. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో చర్చించి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా చేపడతాం' అని అయ్యన్నపాత్రుడు వివరించారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతిలో ఎన్నో చెట్లను నరికి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పట్లో శాంతిభద్రతలూ దెబ్బతిన్నాయన్నారు. సీసీఎఫ్ నాగేశ్వరరావు, బయోట్రిమ్ సెల్వి కల్వరిస్టు యశోదబాయి, జూపార్కు క్యూరేటర్ సెల్వం, తిరుపతి జిల్లా అటవీశాఖ అధికారి సతీష్‌రెడ్డి, ఏసీఎఫ్ నాగభూషణం, అసిస్టెంట్ క్యూరేటర్ జగదీష్ చంద్రప్రసాద్, జూ డాక్టర్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## సాహిత్యంలో సామాజిక స్పృహ ఉండాలి



సాహితీ పురస్కారాలతో గ్రహీతలు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 17: సామాజిక స్పృహ కలిగినదే అసలు సిసలైన సాహిత్యమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య మధురాంతకం నరేంద్ర అన్నారు. శనివారం ఉదయం ప్రముఖ కథారచయిత కేవీ మేఘనాథ్ రెడ్డి రచించిన నవల పాయిదరువులు ఆవిష్కరణ, శివేగారి దేవమ్మ కథా పురస్కారం, బాపురం గురురాజారావు కవితా పురస్కార ప్రదాన సభ జరిగింది. స్థానిక బైరాగిపట్టెడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో నిర్వహించిన ఈ సభలో ఆయన మాట్లాడుతూ.. నేటితరం వారిలో పుస్తకాలు చదివే ఆసక్తి తగ్గిపోతోందన్నారు. తెలుగులో సాహిత్యం కోసం ఒక ప్రత్యేక పత్రిక లేకపోవడం కూడా పరిస్థితికి అద్దం పడుతోందన్నారు. నవలా రచయితగా మేఘనాథ్ రెడ్డి వంటి యువరచయితలు రావడం ఎంతో శుభ పరిణామమన్నారు. విశిష్ట అతిథి, ఆచార్య కె.మధుజ్యోతి (బెంగళూరు వర్సిటీ) మాట్లాడుతూ.. యువ రచయితలు తమ సాహిత్యంలో సమకాలీన సమస్యలను చిత్రీకరిస్తున్నారని, ఇవి వాస్తవికతను ప్రతిబింబిస్తున్నాయని ప్రశంసించారు. అనంతరం కేవీ మేఘనాథ్ రెడ్డి రచించిన నవల పాయిదరువులు ఆవిష్కరణతోపాటు శివేగారి దేవమ్మ కథా పురస్కారం (2023)ను మునిసురేష్ పిళ్లై, ఆర్సీ కృష్ణస్వామి రాజులకు, బాపురం గురురాజారావు కవితా పురస్కారం (2020)ను కూచిమంచి నాగేంద్రకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి పలమనేరు బాలాజి, సాహితీవేత్తలు సీఎన్ చంద్రశేఖర్, పల్లిపట్టు నాగరాజు, సాకం నాగరాజు, జిల్లేళ్ల బాలాజి, మౌని, కొత్వాలు అమరేంద్ర, జి.రమేష్ బాబు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

# గూడూరు

## సూళ్లూరుపేట/వెంకటగిరి

## కంప్యూటర్ల వితరణ




గూడూరు అర్బన్, ఆగస్టు 17: స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి సహకారంతో పాఠశాలకు 3 కంప్యూటర్లను రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శనివారం అందజేశామని రోటరీ క్లబ్ సభ్యుడు మునిగిరీష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి చదలవాడ మురళీధర్ హైదరాబాదులో రోటరీక్లబ్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడన్నారు. రోటరీక్లబ్ ప్రతినిధులు శ్రీధర్‌రెడ్డి, జీజీనాయుడు, కృష్ణయ్య, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, జగదీష్, హరిప్రసాద్, హెచ్‌ఎం భారతి తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ




నాయుడుపేట టౌన్, ఆగస్టు 17 : నవజీవన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. శనివారం పట్టణంలోని సంబంధిత కార్యాలయం నుంచి ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. మీకు తెలుసా అనే కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించినట్లు నవజీవన్ ఆర్గనైజేషన్ మేనేజర్ బాలాజీ తెలిపారు.

## దుకాణాలకు వేలంపాటలు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 17 : పట్టణంలోని నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి షాపింగ్ కాంప్లెక్స్‌లోని 5 దుకాణాలకు వేలంపాటలు నిర్వహించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో 1, 4, 5, 11, 15 దుకాణాలకు వేలం పాటలు నిర్వహించినట్లు జనార్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ వేలంపాటల్లో ఎస్‌కె పర్వీన్, చింతల వెంకటేశ్వర్లు, వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, కొరివి సుబ్రహ్మణ్యం, కాపులూరు అనిల్‌కుమార్‌లు హెచ్చుపాటదారులుగా నిలిచారని కమిషనర్ తెలిపారు.

## ఓడూరు పాఠశాల ఎస్‌ఎంసీ ఎన్నిక వాయిదా

చిల్లకూరు,ఆగస్టు17: మండలంలోని ఓడూరు ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించాల్సిన ఎస్‌ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఈ సందర్భంగా ఎంఈవో రఫూఫ్ మాట్లాడుతూ ఈనెల 8వ తేదీన పారిచెర్లవారిపాళెం ఉన్నత పాఠశాల, ఓడూరు ప్రాథమికోన్నత పాఠశాలలో కోరం లేక ఎన్నికలు వాయిదా పడ్డాయన్నారు. శనివారం పారిచెర్లవారిపాళెం ఉన్నతపాఠశాలలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయన్నారు. ఓడూరు ప్రాథమికోన్నత పాఠశాలలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య స్వల్ప వాదనలు చోటు చేసుకోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాయిదా వేశామన్నారు. టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతిని కొందరు వైసీపీ వర్గీయులు దుర్భాషలాడారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

## విద్యాకమిటీ ఎన్నిక వాయిదా

కోట, ఆగస్టు 17 : కోట మండలంలోని రెండు పాఠశాలల్లో కోరం లేక విద్యాకమిటీ ఛైర్మన్ ఎన్నికలు శనివారం వాయిదా పడ్డాయి. గోవిందపల్లి ఉన్నత పాఠశాలలో విద్యాకమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లను ఎన్నుకునేందుకు తల్లిదండ్రులను పిలిచినప్పటికీ 50శాతం కూడా రాకపోవడంతో ఎంఈవో మస్తానయ్య, హెచ్‌ఎం గిరిబాబు ఈ ఎన్నికను వాయిదా వేశారు. అదేవిధంగా గోవిందపల్లి ప్రాథమిక పాఠశాలలో కూడా 50శాతం వరకు కూడా తల్లిదండ్రులు రాకపోవడంతో ఎన్నిక వాయిదా వేశారు. అదేవిధంగా వాయిదాపడి ఉన్న ఊనుగుంటపాళెం ప్రాథమికోన్నత పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## విద్యాశాఖ మంత్రిని కలసిన టీడీపీ నేత



నాయుడుపేట టౌన్, ఆగస్టు 17 : రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌ను తిరుపతి పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేంద్ర కలిశారు. ఉండవల్లిలో శనివారం జరిగిన ప్రజాదర్బార్‌లో మంత్రిని కలసి వినతి పత్రం అందజేసినట్లు రాజేంద్ర తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో తనపై అన్యాయంగా కేసులు బనాయించారని, ఆ కేసులను విచారించి తనకు న్యాయం చేయాలని కోరినట్లు రాజేంద్ర తెలిపారు.

## ఎమ్మెల్యే అనుచరులమంటూ కానిస్టేబుల్‌పై దాడి

### కేసు నమోదు చేసిన పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 17: తిరుపతిలోని అలిపిరిలో డ్యూటీలో వున్న కానిస్టేబుల్ బి. స్వయంప్రకాష్‌పై శుక్రవారం అర్ధరాత్రి కొంతమంది దౌర్జన్యం చేశారు.దీనిపై ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు....అలిపిరిలో కానిస్టేబుళ్లు స్వయంప్రకాష్, చంద్రశేఖర్ శుక్రవారం రాత్రి డ్యూటీ చేస్తుండగా నెంబరు లేని ఎన్‌ఫీల్డ్ బుల్లెట్‌లో నలుగురు తిరుమల బైపాస్ రోడ్డులోని మున్సిపల్ పార్కు నుంచి అలిపిరి స్టేషన్ వైపు వెళుతున్నారు. అనుమానంతో బుల్లెట్‌ను ఆపి తనిఖీ చేస్తే వాహనానికి సంబంధించి నెంబరు ప్లేటు లేకపోవడంతో ఆర్సీ, లైసెన్సు అడగ్గా కానిస్టేబుళ్లకు చూపించలేదు.పైగా బండిపై వున్న మహేంద్ర, కమలాకర్, మురళి కానిస్టేబుళ్లను దుర్భాషలాడారు. దీంతో వాహనాన్ని తీసుకెళ్లి అలిపిరి స్టేషన్‌లో అప్పగించిన కానిస్టేబుళ్లు రాత్రి డ్యూటీలపై వెళ్లిపోబోయారు. ఇంతలో మళ్లీ స్టేషన్ వద్దకు వచ్చిన వారు 'మా బండి మాకు ఇవ్వండి...మేము ఎమ్మెల్యే అనుచరులం' అంటూ దుర్భాషలాడారు.ఈ విషయం తెలిసిన ఎస్పీ వెంటనే వారిపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు.ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్ ఇచ్చి విడుదల చేసినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ చెప్పారు.కానిస్టేబుళ్లపై దౌర్జన్యం చేసిన వారు చిత్తూరుకు చెందిన మహేంద్ర, కమలాకర్, తిరుపతి పెద్దకాపులేఅవుట్‌కు చెందిన జిమ్ మురళిగా పోలీసులు గుర్తించారు.చిత్తూరు మేయర్ కఠారి అనురాధ హత్య కేసులో నిందితుడుగా వుండిన కమలాకర్ ఇటీవల ఎన్నికల సమయంలో తిరుపతికి చేరాడని ఎస్‌ఐ చెప్పారు.

## పాఠశాలకు ఫర్నిచర్ వితరణ

చిల్లకూరు, ఆగస్టు 17: మండలంలోని చింతవరం జడ్పీ ఉన్నత పాఠశాలకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి డాక్టర్ నారాయణ రూ.5వేలు విలువ చేసే ఫర్నీచర్‌ను వితరణగా అందజేశారు. హెచ్‌ఎం శివసుబ్రమణ్యం మాట్లాడుతూ దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిందితులను కఠినంగా శిక్షించాలి





గూడూరు ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది - నాయుడుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

గూడూరు, ఆగస్టు 17: కోల్‌కతాలోని ఆర్జీకార్ వైద్యకళాశాలలో జూనియర్ మహిళా డాక్టర్ హత్యకేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని గూడూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల వైద్యులు, వైద్యసిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాణాలు కాపాడే వైద్యులకే దేశంలో రక్షణ కరువైందన్నారు. చట్టాలను కఠినతరం చేసి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు జనార్దన్‌రెడ్డి, రోహిణి, మైథిలి, రాజా, బ్రహ్మయ్య, తనూజ, స్వరాజ్యం, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, నరసారెడ్డి, సిబ్బంది గౌరీ, మౌలాలి, బాబురావు పాల్గొన్నారు.

**వెంకటగిరి టౌన్ :** వైద్య విద్యార్థినిపై దాడి అమానుషమని స్త్రీ విముక్తి ఘటన రాష్ట్ర కమిటీ సభ్యురాలు అజిత అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్య సేవల బంద్‌కు మద్దతు పలికారు. యువతను మద్యం, గంజాయి, మాదకద్రవ్యాల మత్తులో ముంచెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి వి.వి. రమణయ్య పాల్గొన్నారు.

**వెంకటగిరి :** కోల్‌కత్తాలో మహిళా డాక్టర్‌పై జరిగిన దారుణ ఘటనకు కారకులైన నిందితులను ఉరి తీయాలని డిమాండ్ చేస్తూ శనివారం వెంకటగిరిలో ప్రైవేటు ఆసుపత్రుల డాక్టర్లు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే రామకృష్ణ నివాసానికి చేరుకొని ఆయన వినతిపత్రం అందచేశారు. వైద్యులకే రక్షణ లేకపోవడం దారుణమన్నారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ ఈ ఘటనలో బాధితులకు త్వరగా న్యాయం జరగాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు సంజీవురాయుడు, కళాధర్, జయప్రకాష్, ముదసూననాయుడు, రామాంజనేయులు, బద్రీనవీన్, సత్యనారాయణ, సాయి,చల్లా సుమన్, శ్రీనివాసులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

**నాయుడుపేట టౌన్ :** కోల్‌కత్తాలో మహిళా వైద్యురాలిపై జరిగిన ఘటనను నిరసిస్తూ వైద్యులు ర్యాలీ నిర్వహించారు. శనివారం పాతబస్టాండ్ సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వైద్యులు, సిబ్బంది పూలమాలలు వేసి ర్యాలీగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. వైద్యులు, సిబ్బందిపై ఇలాంటి దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ గోపీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు హరిప్రియ, చంద్రకళ, రామసుబ్బయ్య, వెంగయ్య, చైతన్య, స్రవంతి, క్రాంతి, శ్రీధర్‌రెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏబీవీపీ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం నుంచి పురవీధుల్లో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. దోషులను వెంటనే శిక్షించాలంటూ వారు డిమాండ్ చేశారు. ఏబీవీపీ నాయకులు తడుకు చెందు, వినయ్, తులసీ, సాయి తదితరులు పాల్గొన్నారు.

**ఓజిలి :** కలకత్తా మెడికో ఘటనపై శనివారం ఓజిలి పీహెచ్‌సీ సిబ్బంది నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఓజిలితోపాటు పెద్దపరియ, వజ్జావారిపాళెం, అత్తివరం పీహెచ్‌సీలలో కూడా అక్కడి సిబ్బంది నిరసన చేస్తూ విధులు చేపట్టారు.

**తడ :** మహిళా ట్రైనీ వైద్యురాలిపై జరిగిన హత్యాచారానికి నిరసనగా తడ, రామాపురం పీహెచ్‌సీలో వైద్యులు నిరసనకు దిగారు. వైద్యులకు భద్రత కల్పించాలంటూ నినాదాలు చేశారు. వైద్యులు కిషోర్, జయశ్రీదేవి, స్వర్ణలత, తదితరులు ఉన్నారు.

## వైద్యుల నిరసనతో నిలిచిన ఓపీ



ఓపీ లేకపోవడంతో నిర్మానుష్యంగా ఉన్న రోగులు వేచివుండే ప్రాంతం

గూడూరు, ఆగస్టు 17: కోల్‌కత్తాలోని ఆర్జీకార్ వైద్యకళాశాలలో జరిగిన జూనియర్ మహిళా డాక్టర్ హత్యను నిరసిస్తూ వైద్యులు 24 గంటలపాటు ఓపీని నిలిపివేసి నిరసన తెలిపారు. దీంతో శనివారం ఉదయం 6గంటల నుంచి ఆదివారం ఉదయం 6గంటల వరకు ఓపీని నిలిపివేసి నిరసన తెలుపుతున్నట్లు వైద్యులు ప్రకటించారు. ఈ క్రమంలో శనివారం ఏరియా ఆసుపత్రి రోగులు లేకపోవడంతో నిర్మానుష్యంగా మారింది. ఏరియా ఆసుపత్రిలో రోజుకు సుమారు 500 మంది వరకు రోగులకు ఓపీ ద్వారా వైద్యపరీక్షలు నిర్వహిస్తుంటారు. పట్టణ, సమీప గ్రామాల నుంచి వచ్చే రోగులతో ఓపీ ప్రాంతం రద్దీగా ఉంటుంది. అయితే వైద్యురాలి హత్యను ఖండిస్తూ వైద్యులు 24గంటల పాటూ ఓపీ నిలిపివేయడంతో ఓపీ ప్రాంతం నిర్మానుష్యంగా మారింది. దూరప్రాంతాల నుంచి వచ్చిన వృద్ధులకు, దివ్యాంగులకు మాత్రమే వైద్యపరీక్షలు నిర్వహించారు. అత్యవసర కేసులను, కాన్పుల విభాగాన్ని యదావిధిగా కొనసాగించారు.

# సర్వీస్ రోడ్డు కోసం వడ్డిపాలెంవాసుల నిరసన



రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు

పెళ్లకూరు, ఆగస్టు 17 : మండలంలోని చిల్లకూరు వడ్డిపాలెం వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఆరువరుసల జాతీయ రహదారి దాటేందుకు వసతిలేకపోవడంతో ఆ గ్రామస్థులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మూకుమ్మడిగా 71వ జాతీయ రహదారిపైకి చేరుకుని దిగ్బంధం చేశారు. సుమారు గంట వరకు రాస్తారోకో చేపట్టారు. బడి పిల్లలు స్కూల్‌కు, రైతులు, కూలీలు పంట పొలాలకు ప్రతి నిత్యం ప్రాణాలు పణంగా పెట్టి జాతీయ రహదారి దాటి వెళ్లాల్సి వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం రోడ్డుకు ఇరువైపులా సర్వీస్ రోడ్డు నిర్మించాలని కోరినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. సర్వీస్ రోడ్డు నిర్మించకపోగా రహదారికి ఇరువైపులా కంచె ఏర్పాటు చేయడంతో సుమారు కిలోమీటర్ దూరం వెళ్లి రోడ్డు దాటే పరిస్థితి నెలకొందని వారు తెలిపారు. దీంతో కాంట్రాక్టర్లు వచ్చి సర్వీస్ రోడ్డు నిర్మించే వరకు రోడ్డు దాటేందుకు దారి సౌకర్యం కల్పిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరారు.

# ఐఐటీలో అంతరిక్ష దినోత్సవం



రాకెట్, గ్రహసంచార రోబో నమూనాలతో విద్యార్థులు, సమావేశానికి హాజరైన వివిధ పాఠశాలల విద్యార్థులు

ఏర్పేడు, ఆగస్టు 17: శాస్త్ర సాంకేతిక రంగాల్లో విశిష్ట సేవలందించిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు ఇస్రో అధికారి డాక్టర్ మనీష్ సక్సేనా సూచించారు.జాతీయ అంతరిక్ష దినోత్సవ సందర్భంగా ఏర్పేడులోని ఐఐటీ టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్, నవవిష్కర్ ఐ-హబ్ ఫౌండేషన్ కలసి సెలబ్రేటింగ్ స్పేస్ అండ్ ఇంటర్‌స్టెల్లార్ ఫెస్ట్ ఫర్ స్కూల్ పేరుతో శనివారం ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు.26 ప్రైవేటు పాఠశాలలతోపాటు 6 ప్రభుత్వ పాఠశాలలనుంచి వెయ్యిమందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. బెంగళూరు ఇస్రో ప్రధాన కార్యాలయ శాటిలైట్ నావిగేషన్ ప్రోగ్రాం ఆఫీస్ డైరెక్టర్ డాక్టర్ మనీష్ సక్సేనా, శ్రీహరికోట ఎస్‌డీఎస్‌సీలోని పీసీక్యూజ, సాలిగ్ మోటార్స్ ప్రొపెలెంట్ కాంప్లెక్స్ చీఫ్ జనరల్ మేనేజరు డాక్టర్ టీవీ రమణారెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనల గురించి వివరించారు. ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ,నవవిష్కర్ ఐహబ్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ రోషన్ శ్రీవాత్సవ నావిగేషన్ ప్రాముఖ్యతను వివరించారు. 80మంది విద్యార్థులు ప్రసంగ పోటీల్లో, 120మంది విద్యార్థులు క్విజ్ పోటీల్లో, 150మంది విద్యార్థులు డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్నారు.సౌరవ్యవస్థ, స్పేస్‌కాలనీ మోడల్, గ్రహాల వ్యవస్థ, కాంతి, నీడలపై తయారు చేసిన నమూనాలను ప్రదర్శించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఆదివారం బహుమతులను అందజేయనున్నారు.

# లక్షమందికి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యం

### ఎమ్మెల్యే విజయశ్రీ, రాజేష్‌లను కలసిన ఎన్నారై



ఎమ్మెల్యే విజయశ్రీ, పార్థసారథి దంపతులను సత్కరిస్తున్న ఎన్‌ఆర్‌ఐ వంశీకృష

పెళ్లకూరు, ఆగస్టు 17 : ఐరోపా దేశాలలో చదువుకోవాలనుకునే వారికి, పరిశోధక విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని జీలపాటూరు గ్రామానికి చెందిన టీడీపీ యూకే ఎన్నారై విభాగం కన్వీనర్ వంశీకృష్ణ ఆరూరు తెలిపారు. ఆయన శనివారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, ఆమె సోదరుడు రాజేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ ఇప్పటివరకు నియోజకవర్గంలోని 68 విద్యార్థులకు విదేశాలలో ఉద్యోగాలు కల్పించడంలో సహాయ సహకారాలు అందించినట్లు తెలిపారు. గత ఎన్నికల సమయంలో టీడీపీకి మద్దతుగా చేసిన ప్రచారంలో లక్ష మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చామని, అందుకు చర్యలు చేపట్టామన్నారు. ముఖ్యంగా లండన్, ఐరోపాలోని ఇతర నగరాలలో చదువుకోవాలనుకునే విద్యార్థులకు పూర్తిగా మద్దతు పలుకుతామని తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులతో పాటు నెలవల రాజేష్‌ను ఘనంగా సత్కరించారు.

## తిరుమలలో హాకర్ల మధ్య ఘర్షణ



ఘర్షణకు దిగిన శ్రీకాంత్, శ్రీనివాస్

తిరుమల, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఇద్దరు హాకర్లు గాజుబాటిళ్లతో పరస్పరం దాడి చేసుకుంటూ వీరంగం సృష్టించారు. వ్యాపార విషయంలో మొదలైన గొడవ పెరిగి తీవ్రంగా గాయపరుచుకునేంతవరకు వెళ్లింది. రక్తగాయాలతో పెద్దపెద్ద కేకలు వేస్తూ వారు చేసిన వీరంగానికి భక్తులు భయభ్రాంతులకు గురయ్యారు. నల్గొండకు చెందిన శ్రీకాంత్, తిరుపతికి చెందిన శ్రీనివాస్ తిరుమలలోని నందకం విశ్రాంతి భవనం ముందు అనధికారికంగా భక్తులకు షాంపూలు, సోపులు, బ్రష్‌లు వంటివి విక్రయిస్తుంటారు.నా స్థానంలో నువ్వు వ్యాపారం చేస్తున్నావని ఒకరు, నేను అమ్మే వస్తువులు నువ్వు ఎలా విక్రయిస్తావని మరొకరు గొడవకు దిగారు. కొద్దిసేపు వీరిద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సహనం కోల్పోయిన ఇద్దరూ పక్కనే ఉన్న ఓ డెయిరీ పార్లర్ వద్ద గాజు బాటిళ్లను తీసుకుని దాడులు చేసుకున్నారు. ఇద్దరికి తీవ్రస్థాయిలో రక్త గాయాలయ్యాయి. ఈ క్రమంలో అక్కడున్న భక్తులు హడలిపోయారు. సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ సత్యనారాయణ సిబ్బందితో కలిసి ఘటనా ప్రాంతానికి చేరుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్‌ను తిరుపతి రుయాస్పత్రికి తరలించారు.

## పూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు



తిరుమల, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో మూడురోజుల పాటు జరిగిన పవిత్రోత్సవాలు శనివారం పూర్ణాహుతితో ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం యాగశాలలో ఋత్వికులు హోమాలు నిర్వహించారు. తర్వాత శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం చేపట్టారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపుతో అభిషేకించి చివరగా చందనం పూత పూశారు. ధూపదీప హారతులు నివేదించారు. సాయంత్రం ఉత్సవమూర్తులు ఆలయ మాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. ఆ తర్వాత పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం విమాన ప్రదక్షిణగా ఉత్సవమూర్తులు ఆలయ ప్రవేశం చేయడంతో పవిత్రోత్సవాలు ముగిశాయి. ఈకార్యక్రమ నేపథ్యంలో ఆలయంలో కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.టీటీడీ జీయర్ స్వాములు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, డిప్యూటీఈవో లోకనాథం ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఉపరాష్ట్రపతికి ఘన స్వాగతం


ఉపరాష్ట్రపతికి శ్రీవారి ప్రతిమను అందజేస్తున్న మంత్రి ఆనం, కలెక్టర్

రేణిగుంట, ఆగస్టు 17: ఉపరాష్ట్రపతి జగదీష్ దన్కడ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో శనివారం ఉదయం ఘన స్వాగతం లభించింది. నెల్లూరు జిల్లాలో అక్షర విద్యాలయ క్యాంపస్, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం, స్వర్ణభారత్ ట్రస్టు 23వ వార్షికోత్సవంలో పాల్గొనేందుకు ఢిల్లీ నుంచి ఉప రాష్ట్రపతి దంపతులు ప్రత్యేక విమానంలో ఉదయం 9.35గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో నెల్లూరుకు బయలుదేరి వెళ్లారు. అక్కడ కార్యక్రమం ముగిశాక మధ్యాహ్నం 2.08గంటలను రేణిగుంట విమానాశ్రయం చేరుకుని ప్రత్యేక విమానంలో ఉపరాష్ట్రపతి దంపతులు ఢిల్లీకి తిరుగుపయనం అయ్యారు. ఆయనకు రాష్ట్ర దేవదాయశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఐజీ రాజుకుమార్ మీనా, డీఐజీ షిమోషి బాజ్‌పాయ్, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, తిరుపతి నగర మేయర్ శిరీష స్వాగతం, వీడ్కోలు పలికారు.

## భాషా సామర్థ్యాల పెంపునకు కృషి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో రవీంద్రనాథ్

బుచ్చినాయుడు కండ్రిగ, ఆగస్టు 17: విద్యార్థుల్లో సృజనాత్మక భాషా సామర్థ్యాలను వెలికి తీసేలా బోధన సాగాలని ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రహ్మణ్యం అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీఎన్‌కండ్రిగ, వరదయ్యపాళెం, సత్యవేడు మండలాలకు సంబంధించిన తెలుగు ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ తెలుగు ఆవశ్యకత, ఔన్నత్యాన్ని తెలుసుకునేలా భాషా సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తెలుగు భాషా పండితులు యువశ్రీ మురళి, పురుషోత్తమ్, అమర్నాథ్‌రెడ్డి, గిరి, గురువయ్య, నరేష్, ఏడుకొండలయ్య రిసోర్సు పర్సన్లుగా వ్యవహరించారు.

## విద్యాసంస్థల బస్సుల పటిష్టతపై నిర్లక్ష్యం తగదు

శ్రీకాళహస్తి, ఆగస్టు 17: విద్యాసంస్థల బస్సుల పటిష్టతపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పదని శ్రీకాళహస్తి మోటారు వాహనాల తనిఖీ అధికారి దామోదర్‌నాయుడు హెచ్చరించారు. శనివారం పట్టణంలోని పాఠశాలలు, కళాశాలల బస్సులను తనిఖీ చేశారు. ఐదు పాఠశాలలకు చెందిన బస్సులు పరిమితికి విద్యార్థులను తరలిస్తున్నట్లు గుర్తించారు. అలాగే రెండు బస్సులను అనుభవం లేని డ్రైవర్లు నడుపుతుండగా, మరో రెండు బస్సులు ట్యాక్స్ చెల్లించలేదని తనిఖీలో తేలింది. మొత్తంగా 9బస్సులపై కేసు నమోదు చేసి రూ.70,400 జరిమానా వసూలు చేసినట్లు ఎంవీఐ తెలిపారు.

## సీతారాంపేటలో భూ ఆక్రమణలను అరికట్టండి

ఏర్పేడు, ఆగస్టు 17: ఏర్పేడు మండలం సీతారాంపేట గ్రామంలో భూ ఆక్రమణలను అరికట్టాలని బీజేపీ నేత గురవయ్య యాదవ్ కోరారు. శనివారం ఆయన తహసీల్దారు భార్గవికి వినతిపత్రం అందించారు. సీతారాంపేట గ్రామంలో ఉన్న ప్రభుత్వ స్థలాలను అక్రమార్కులు కబ్జా చేసి విక్రయించడంతో పాటు అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా చెరువుకు సంబంధించిన కాలువలు సైతం ఆక్రమణకు గురయ్యాయని వివరించారు. స్పందించిన తహసీల్దారు సర్వే చేసి ప్రభుత్వ ఆస్తులను కాపాడటానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## పల్లకిలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి

నారాయణవనం, ఆగస్టు 17: నారాయణవనంలోని భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారిని పల్లకిలో ఊరేగించారు. ఉదయం ఆలయాన్ని తెరిచిన అర్చకులు నిత్య పూజలను పూర్తి చేసి, భద్రకాళి, వీరభద్రస్వామి వారికి స్నపన తిరుమంజనం చేసి దూప, దీప నైవేద్యాలను సమర్పించారు. 10 గంటలకు వీరఖడ్గ స్నానం కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకు భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి తిరువీధి ఉత్సవాన్ని నిర్వహించి పల్లకిలో ఊరేగించారు. సాయంత్రం 7 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

## ఈవీఎం గోదాము తనిఖీ

రేణిగుంట, ఆగస్టు 17: విమానాశ్రయ సమీపంలోని ఈవీఎం గోదామును రాష్ట్ర ఎలక్ట్రోల్ అధికారి వివేక్‌యాదవ్ తనిఖీ చేశారు. శనివారం సాయంత్రం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కలిసి ఈవీఎంలు భద్రపరచిన గోదామును సందర్శించారు. ఈవీఎం గోదాము వద్ద 24గంటల భద్రతా ఏర్పాట్ల పట్ల వివేక్‌యాదవ్ సంతప్తి వ్యక్తం చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి పెంచలకిషోర్, ఈవీఎం నోడల్ అధికారి కోదండరామిరెడ్డి పాల్గొన్నారు.

## చెరకుతోట దగ్ధం

కేవీబీపురం, ఆగస్టు 17: మండలంలోని రాయపేడు గ్రామానికి చెందిన రైతు జనార్ధన్ రెండున్నర ఎకరాల చెరకు తోట శనివారం మధ్యాహ్నం దగ్ధమైంది. పొలంలోని విద్యుత్ వైర్లు ఒకదానికొకటి రాసుకోవడంతో చెరకు తోటకు నిప్పంటుంది. ప్రమాద సమయంలో అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేసినా స్పందించలేదని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని కోరుతున్నాడు.

# శ్రీకాళహస్తి సత్యవేడు

## సినీ ఫక్కీలో బంగారు గొలుసు చోరీ

శ్రీకాళహస్తి, ఆగస్టు 17: ద్విచక్ర వాహనంపై హెల్మెట్ ధరించి వచ్చిన ఇద్దరు దొంగలు మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కుని సినీఫక్కీలో ఉడాయించారు. తొట్టంబేడు మండలం చిన్నసింగమాలకు చెందిన గున్నమ్మ(37) శనివారం సాయంత్రం ఆవులను మేత కోసం ఊరి చివరకు తోలుకెళ్లింది. ఆవులు మేస్తుండగా ఆమె రోడ్డు పక్కన కాపలాగా నిలబడింది. ఈ సమయంలో ద్విచక్ర వాహనంపై హెల్మెట్ ధరించి వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కుని పరారయ్యారు. బాధితురాలు కుటుంబ సభ్యులతో కలిసి శ్రీకాళహస్తి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి ఆ మార్గంలో సీసీ కెమెరాల ద్వారా నిందితుల కోసం గాలిస్తున్నారు. కాగా, ఇదే తరహాలో ద్విచక్ర వాహనంపై హెల్మెట్ ధరించిన ఇద్దరు యువకులు రెండు నెలల క్రితం పట్టణంలోని టింబర్ డిపో ప్రాంతం వెనుక రోడ్డుపై నడచివెళుతున్న మహిళ మెడలో బంగారు గొలుసును లాక్కుని పారిపోయారు. అలాగే నెల రోజుల క్రితం అమ్మపాళెం వద్ద రోడ్డుపై నడచివెళుతున్న మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లారు. తాజాగా శనివారం చిన్నసింగమాల వద్ద హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కుని వెళ్లారు.

## రాంబాబు నాయుడికి సన్మానం



శ్రీకాళహస్తి, ఆగస్టు 17: టీడీపీ సీనియర్ నేత రాంబాబు నాయుడిని ఆ పార్టీ నాయకులు సత్కరించారు. రాంబాబు నాయుడు రెండు నెలల విదేశీ పర్యటనను ముగించుకుని శనివారం శ్రీకాళహస్తి పట్టణానికి విచ్చేశారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు ఆయనను ముక్కంటి ఆలయ శేషవస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో గంగలపూడి హరి, సిద్ధులయ్య, మిన్నల రవి, మునిరాజా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మిద్దెపై నుంచి పడి టీడీపీ కార్యకర్త మృతి

రేణిగుంట, ఆగస్టు 17: ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి పడి టీడీపీ కార్యకర్త మృతి చెందిన సంఘటన శనివారం ఉదయం దొడ్లమిట్టలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... మండల పరిధిలో కరకంబాడి పంచాయతీ దొడ్లమిట్ట బీసీ కాలనీలో నివాసం ఉంటున్న టీడీపీ కార్యకర్త మునెయ్య(67) అదే ప్రాంతంలో కొత్త ఇంటిని నిర్మిస్తున్నాడు. ఉదయం మొదటి అంతస్తులో ఫ్లోరింగ్‌పై నీళ్లు పడుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడటంతో బలమైన గాయం అయింది. అమర ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ అరుణకుమార్ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## 12వేల ఎకరాల భూమి కబ్జా: కోలా ఆనంద్


తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతున్న కోలా ఆనంద్

శ్రీకాళహస్తి, ఆగస్టు 17: 'రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ హయాంలో అసైన్డ్, చుక్కల భూములను ఫ్రీహోల్డ్ (కొనుగోలుకు చట్టబద్ధత చేసుకుని) ద్వారా వేల ఎకరాల కబ్జా చేశారు. ఒక్క శ్రీకాళహస్తి నియోజకవర్గంలోనే 12వేల ఎకరాలు కబ్జా చేశారు. ఇందులో ఆరు వేల ఎకరాలకు పక్కా ఆధారాలు సేకరించాం' అని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రెండు నెలల్లో వైసీపీ నాయకులు రాయలసీమ పరిధిలో ఆరు జిల్లాల్లో 18వేల ఎకరాల కబ్జా చేశారని నిర్ధారణ అయిందన్నారు. ఇందులో ఒక్క శ్రీకాళహస్తిలోనే 12వేల ఎకరాలు కబ్జాకు గురికావడం ఆశ్చర్యాన్ని కల్గించిందన్నారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సహకారంతోనే ఈ కబ్జాలు జరిగాయన్నారు. జగనన్న ఇళ్ల పట్టాల కోసం జరిగిన భూసేకరణలో పెద్ద దందా చేశారన్నారు. పేదవారి దగ్గర ఎకరా రూ.ఐదు లక్షలకు కొనుగోలు చేసి.. తమకు కావాల్సిన వారికి కట్టబెట్టి ప్రభుత్వ నష్టపరిహారం కింద రూ.50లక్షలు కొట్టేశారన్నారు. శ్రీకాళహస్తిలోని రాజీవ్‌నగర్‌లో నకిలీ ఎన్‌వోసీలు ఇచ్చి భూదందా చేశారన్నారు. ఇందులో మాజీ సీఎం జగన్ వ్యక్తిగత కార్యదర్శి ధనంజయరెడ్డి, అప్పటి కలెక్టర్ వెంకటరమణారెడ్డి, సబ్ రిజిస్ట్రార్, వీఆర్వోలు ఉన్నారన్నారు. రేణిగుంట మండలం అన్నస్వామిపల్లిలో అయితే దాదాపు రూ.వెయ్యికోట్ల భూదందా చేశారన్నారు. వీటన్నింటిపై విచారణ జరుగుతోందని.. త్వరలోనే దీనివెనకున్న వారంతా జైలుకు పోవడం ఖాయమన్నారు. అలాగే వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, ఢిల్లీ పెద్దలను కోరతామని తెలిపారు. ఈ అంశంపై సీబీఐ విచారణ చేపట్టాలన్నారు. బీజేపీ నాయకులు సామంచి శ్రీనివాస్, డాక్టర్ శ్రీహరిరావు, సుబ్రహ్మణ్యంరెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ


ముక్కంటి ఆలయం వద్ద ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 17: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 28వేలమంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇందులో రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,458మంది, రూ.50 ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,276మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 టిక్కెట్ల ద్వారా 2,856 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,237, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 406 మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 279మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 75మంది భక్తులు రాహుకేతు పూజలు చేయించుకున్నారు.

## వైభవంగా కల్యాణ వెంకన్న ఊంజలసేవ

నారాయణవనం, ఆగస్టు 17: నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఊంజలసేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు చేపట్టారు. అనంతరం స్వామివారిని, శ్రీదేవి, భూదేవి ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఊంజలసేవ నిర్వహించారు.

## విద్యాసామగ్రి పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 17: మండలంలోని చల్లమాంబపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్కూల్ మేళా రూరల్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు విద్యాసామగ్రి శనివారం పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు చిట్టిబాబు, సంస్థ ప్రతినిధులు వెంకటేశు, అరుణ్‌కుమార్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు: కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

రేణిగుంట, ఆగస్టు 17: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శనివారం రేణిగుంట విమానాశ్రయంలో ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి భద్రత ఏర్పాట్లపై వివిధ శాఖ అధికారులతో సమక్షా సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 19న ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఎస్పీ సుబ్బ రాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనలో భద్రతాపరమైన అంశాల్లో ఎలాంటి రాజీ లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీలు కులశేఖర్, విమలకుమారి, ఆర్డీవో కిరణ్ కుమార్, జోనల్ మేనేజరు ఏపీఐఐసీ చంద్రశేఖర్, ఫైర్ అధికారి రమణయ్య, ఆర్అండ్‌బీ ఎస్ఈ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల్లో నైపుణ్యం పెంపొందించాలి

కేవీబీపురం, ఆగస్ట 17: శిక్షణతో పిల్లల్లో నైపుణ్యం, మానసిక, శారీరక అభివృద్ధిని పెంపొందించాలని ప్రజాప్రగతి ట్రస్టు ఛైర్మన్ శ్రీనివాసులు చెప్పారు. శనివారం మండల కేంద్రంలో అంగన్వాడీలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి, బీఎన్‌కండ్రిగ, వరదయ్యపాళెం, కేవీబీపురం మండలాల్లో అంగన్వాడీ పిల్లల మానసిక, శారీరక అభివృద్ధికి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పిచ్చాటూరు సీడీపీవో రాధారాణి, సూపర్‌వైజర్లు కల్పలత, సుమతి, ప్రజాప్రగతి ట్రస్టు కోఆర్డినేటర్లు చంద్రశేఖర్, వేణుగోపాల్, ఈశ్వరయ్య, గంగయ్య, చిరంజీవి, ఓంకార్, అంగన్వాడీలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాప్రగతి ట్రస్టు నిర్వాహకులు



శ్రీకాళహస్తి, సత్యవేడులో నిరసన తెలుపుతున్న డాక్టర్లు

## వైద్యసిబ్బంది నిరసన

శ్రీకాళహస్తి, ఆగస్టు 17: శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి వైద్యసిబ్బంది శనివారం నిరసన తెలిపారు. ఓపీ సేవలను బహిష్కరించారు. వైద్యసిబ్బంది మాట్లాడుతూ కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిని అత్యాచారం చేసి హతమార్చడం అమానుష చర్య అని అన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

**సత్యవేడు:** కోల్‌కతాలో మహిళా ట్రైనీ డాక్టర్‌ను అత్యాచారం చేసి, హత్య చేసిన దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ సత్యవేడులో స్థానిక ప్రభుత్వాస్పత్రి డాక్టర్లు, సిబ్బంది నిరసన తెలిపారు. ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద నిలబడి నినాదాలు చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో చిన్నపాండూరు పీహెచ్‌సీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అనిత, డాక్టర్లు సురేష్ మానస, హరిప్రసాద్, చంద్రన్, విద్యాసాగర్, నర్సింగ్ ఆఫీసర్ రమాదేవి, సిబంది పాల్గొన్నారు.

# పుత్తూరు వార్తలు

## స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ

పుత్తూరు, ఆగస్టు 17: పుత్తూరు మండలంలోని పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో రివీట్ ఆర్కిటెక్చర్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ కోర్సుల్లో సెప్టెంబరు 2 నుంచి శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ కుమార్ తెలిపారు. డిప్లొమా, ఐటీఐ, ఇంటర్ పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9010222155 నెంబరును సంప్రదించాలని కోరారు.

## వైద్య సేవలు బంద్


ప్రభుత్వాస్పత్రి వద్ద వైద్యుల నిరసన

పుత్తూరు, ఆగస్టు 17: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనకు నిరసనగా పుత్తూరు పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు శనివారం నిరసన తెలిపాయి. ఐఎంఏ కేంద్ర కమిటీ సభ్యుడు డాక్టర్ రవిరాజు, డాక్టర్ కృష్ణప్రశాంత్ ఆధ్వర్యంలో వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్లు, సిబ్బంది భైఠాయించి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.

## వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం

వడమాలపేట, ఆగస్టు 17: అప్పలాయగుంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజలసేవ వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వరస్వామిని సర్వాభరణాలు, పూలమాలలతో ఊయలలో అలంకరించి వేదమంత్రాలు, భక్తులు గోవింద నామస్మరణల నడుమ శ్రీవారి ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం మేళతాలాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో ఊరేగించారు.


పుత్తూరులోని ద్రౌపదీదేవి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నాట్యాంజలి భరతనాట్యం కళాశాల విద్యార్థి దివ్యశ్రీ ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది. దివ్యశ్రీని ఆలయ నిర్వాహకులు సన్మానించారు.


రథోత్సవం - అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

## వైభవంగా రథోత్సవం

పుత్తూరు టౌన్, ఆగస్టు 17: పుత్తూరు పట్టణంలోని ద్రౌపదీదేవి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం రథాన్ని వివిధ పుష్పాలంకరణతో సుందరంగా ముస్తాబు చేశారు. రథం చుట్టూ వివిధ దేవతల ప్రతిమలను ప్రతిష్టింపజేశారు. నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ అమ్మవారికి చీర, సారె సమర్పించి పూజలు నిర్వహించారు. రథాన్ని లాంచనంగా ముందుకు లాగి ప్రారంభించారు. రథం ముందు కమ్మసంఘం నాయకులు పాండవుల వేషధారణలో భక్తులను అలరించారు. భక్తులు రథంపై ఉప్పు, మిరయాలు చల్లి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గాలి జీవరత్నం నాయుడు, రావిళ్ల మాధవ నాయుడు, రమేష్ నాయుడు, బాబు నాయుడు, గాలి గోపీనాథ్, కమ్మసంఘ నాయకులు, ఉత్సవ నిర్వాహకులు యుగంధర్, సాళ్వాకం క్రిష్టప్ప మెదలి తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ మంత్రి రోజా పట్టు వస్త్రాలను సమర్పించారు. మున్సిపల్ చైర్మన్ హరి, వైస్‌చైర్మన్లు జయప్రకాష్, శంకర్, ఆలయ మాజీ చైర్మన్ లారీ మోహన్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

### అలరించిన దుర్యోధన, దుశ్శాసన వధ

ద్రౌపదీదేవి బ్రహ్మోత్సవాల్లో శనివారం జరిగిన దుర్యోధన, దుశ్శాసన వధ ఘట్టం భక్తులకు అలరించింది. ద్రౌపది వస్త్రాభరణాన్ని అవమానంగా భావించిన భీముడు, దుర్యోధన, దుశ్శాసన వేషధారులను వధించారు. అనంతరం పాండవులు మహా రథాన్ని అధిరోహించి పట్టణ పురవీధుల్లో ఊరేగారు. ఈ కార్యక్రమాన్ని కమ్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు.

## వైభవంగా మహాచండీ యాగం


భక్తులచే మంత్ర పుష్పం నిర్వహిస్తున్న అర్చకులు

వడమాలపేట, ఆగస్టు 17: మండలంలోని ఎస్‌వీ పురం సీతారామ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న కుంభాభిషేక ఉత్సవాల్లో శనివారం చండీయాగం వైభవంగా నిర్వహించారు. వేదపారాయణం, నక్షత్ర, సుదర్శన, లక్ష్మీయాగం, మంత్ర పుష్పం, యంత్ర ప్రతిష్ఠ, విశేష హోమం, లలితా సహస్రనామార్చన నిర్వహించారు. ఆదివారం ఉదయం మహా కుంభాభిషేకం, సాయంత్రం సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.